నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 29 • పేజీలు : 8 • మంగళవారం 29 అక్టోబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati

- స్పెయిన్ ప్రధానితో నరేంద్ర మోదీ రోడ్ షో
- లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ
- వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ
- సైనిక విమానాల తయారీ కోసం ఈ ఫెసిలిటీని ఉపయోగిస్తారు..
- సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదే
- భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకున్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్
- తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే..
- విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహణ

'భారత్' మరింత ముందుకు..

టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

గాంధీనగర్, అక్టోబరు 28 : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు.కాగా మిగతా 7లో

ఎపి హైకోర్టు అదనపు న్యాయమూర్తుల

ప్రమాణం

- ముగ్గురు అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం స్వీకారం
- ప్రమాణం చేసిన మహేశ్వరరావు,చంద్రధనశేఖర్, గుణరంజన్
- ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- మొదటి కోర్టు హాల్లో జరిగిన ప్రమాణంస్వీకార కార్యక్రమం

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన ముగ్గురు న్యాయమూర్తులచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.ఈ మేరకు సోమవారం హైకోర్టులోని మిగతా 7లో

జనాభా లెక్కలు షురూ..!

2026 కొనసాగనున్న ప్రక్రియ

చివరిసారిగా 2011లో లెక్కలు

7లో

నేడు ఇడుపులపాయకు జగన్

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నాడు వైఎస్సార్ జిల్లాకు వెళ్లనున్నారు. బెంగళూరు నుంచి బయలుదేరి వైఎస్ జగన్..మొదట ఇడుపులపాయ చేరుకుంటారు. అనంతరం పులివెందులకు వెళ్తారు.వైఎస్ జగన్ నేడు వైఎస్సార్ జిల్లాకు వెళ్లనున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 10.45 గంటల మిగతా 7లో

తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపు

- పోలీసులకు సమాచారం ఇచ్చిన హోటల్ యాజమాన్యం



న్యూఢిల్లీ, అక్టోబరు 28 : విమానాలకు బాంబు బెదిరింపులతో ఇప్పటికే ఆందోళన నెలకొనగా, తాజాగా హోటళ్లకు కూడా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతున్నది. ఆదివారం తిరుపతి, రాజ్‌కోట్, కోల్‌కతా, లక్నోలోని ప్రముఖ హోటళ్లకు ఈ-మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన మిగతా 7లో

ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల దాడి

శ్రీనగర్,అక్టోబరు 28 : జమ్ము కశ్మీర్‌లో వరుస ఉగ్రదాడి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే కాలంలో ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఎక్కడో ఒకచోట భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడుతున్నారు. తాజాగా అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం సృష్టించింది. ఆర్మీ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. అఖ్నూర్ మిగతా 7లో

పెట్టుబడులే లక్ష్యంగా లోకేశ్

అడుగులు..

- ఆస్టిన్,డల్లాస్ నగరాల్లో మంత్రి లోకేశ్ బిజీబిజీ - టెస్లా సీఎఫ్ఓతో భేటీ.. - ఎపికి రావడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి..
- ఈవీ రంగానికి అనంతపురం అనుకూలమైన ప్రదేశం

అమరావతి,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : పెట్టుబడల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటన సాగుతోంది. అమెరికాలోని ఆస్టిన్, డల్లాస్ నగరాల్లో మంత్రి బిజీబిజీగా గడు పుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులపై మిగతా 7లో

జగన్ జైలుకెళ్లడం

ఖాయం

- రాజకీయాల్లో హత్య ఉండవు..ఆత్మహత్యలే ఉంటాయి..
- ఒక ఆర్థిక నేరస్తుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేమిటి?
- యనమల రామకృష్ణుడు

7లో

ఉచిత సిలిండర్ల పథకం..

- ఉచిత గ్యాస్ సిలెండర్లపై మరో గుడ్‌న్యూస్
- ఒక సిలిండర్ రాయితీ మొత్తం రూ.895 కోట్లు
- నిధుల విడుదలకు ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉచిత సిలిండర్ నిధులను డీబీటీ ద్వారా జమ

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): ఉచిత సిలిండర్ల పథకం రాయితీ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ కంపెనీలు, పౌరసరఫరాలశాఖ తెరచిన ఖాతాలో ఈ నిధులు జమచేయనున్నారు.ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా మిగతా 7లో

ఎపి సర్కార్ కీలక

నిర్ణయం..

- జగన్ రహస్య జీవోలకు వెలుగు
- వెబ్‌సైట్‌లో పెట్టాలని ప్రభుత్వం ఆదేశం
- అన్ని జీవోలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): వైకాపా హయాంలో రహస్యంగా ఉంచిన జీవోలను జీవో ఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ మిగతా 7లో

గతంలో అనేక

తప్పులు..

- విద్యుత్ ఛార్జీలు పెంచలేదు
- తప్పులన్నీ మీరు చేసి..కూటమి ప్రభుత్వంపై విమర్శలా?
- వైకాపా హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం
- వైఎస్ జగన్‌కు మంత్రి గొట్టిపాటి కౌంటర్

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): వైకాపా అధినేత జగన్‌కి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ మిగతా 7లో

నటి జెత్వానీ కేసు..

- ఎపి హైకోర్టులో కుక్కల విద్యాసాగర్ పిటిషన్
- రిమాండ్ రిపోర్ట్ క్వాష్ చేయాలంటూ పిటిషన్
- విద్యాసాగర్ పిటిషన్‌ను కొట్టేసిన ఎపి హైకోర్టు
- నటి జెత్వానీ కేసులో ఏ1గా ఉన్న విద్యాసాగర్

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని కుక్కల విద్యాసాగర్ గతంలో పిటిషన్ వేశారు.ఈ కేసులో ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. తాజాగా ముంబై నటి కేసులో తన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ కుక్కల విద్యాసాగర్ మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

ఐ ఈ ఎస్ వచ్చేనా?

విద్యా వ్యవస్థలో కొత్త విధానాలు వచ్చేశాయి,ఇంకా ఇంకా వస్తున్నాయి.చదువుల్లో ఎన్నో మార్పులు రావాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.విద్యా విధానంలో సంస్కరణలు సమగ్రంగా జరగాలని పెద్దలు దశాబ్దాలుగా సూచిస్తున్నారు.నూతన విద్యా విధానం-2020ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి కూడా చాలా కాలమైంది.దీని ప్రభావం, పరిణామాలు,ఫలితాలపై సమగ్ర సమీక్షలు జరగాలి.మనో వికాసానికి -ఉపాధికి - జాతి ప్రగతికి తోడ్పడని విద్య నిరర్థకం.చాలా ఏళ్ళ నుంచి పాత చింతకాయ పచ్చడి జాడీల్లోనే విద్య ఉండి పోయింది.చాలా తక్కువ కోర్సులకే డిమాండ్ ఉండి,ఎన్నో సబ్జక్ట్స్ నిరర్థకంగా మారిపోయిన సందర్భాలు ఇంకా సమసిపోలేదు.'డిమాండ్-సప్లై' సూత్రం అమలులో సంపూర్ణత్వం సాధించాల్సివుంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి కూడా చిన్న చిన్న ఉద్యోగాలకే,చాలీ చాలని జీతాలకే పరిమితమైపోయిన వారు ఎందరో మన మధ్య అలాగే ఉన్నారు.అటు వృత్తి నైపుణ్యం లేదు -ఇటు కమ్యూనికేషన్ స్కిల్స్ లేవు. కేవలం సర్టిఫికెట్స్ తప్ప జ్ఞానం అంతంతమాత్రమే అనే పరిస్థితుల్లో చాలామంది ఉన్నారు.ఆ సర్టిఫికెట్స్ కూడాఅన్ని ఉద్యోగాలకు పనికి రావు.చదివిన విద్యకు -చేసే ఉద్యోగానికి ఏమాత్రం సంబంధం లేకుండానే విద్యా వ్యవస్థ నిన్నటి వరకూ బలంగా వేళ్లూనుకొని ఉంది.75 ఏళ్ళ స్వతంత్ర భారతంలోఎన్నో ప్రభుత్వాలు మారాయి.కానీ,ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు,అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను మార్చుకుంటూ వెళ్లడంలో బలమైన అడుగులు పడలేదు.ఎక్కువమంది చిరుద్యోగులుగా,నిరుద్యోగులుగా మిగిలిపోయారు.దేశ అవసరాలకు ఈ చదువులు ఉపయోగ పడిన దాఖలాలు తక్కువే.వ్యక్తిగతంగానూ ఆ విద్యార్థికి అవి ఉపయోగపడలేదు.అలా విద్యా విధానంరెంటికి చెడ్డ రేవడి చందంగా మారింది.ప్రధానంగా నిపుణుల కొరత చాలా ఎక్కువగా ఉంది.పరిశోధనచాలా పేదగా ఉంది.కొన్ని కోర్సులు మాత్రమే ఉపయోగపడ్డాయి. కొంతమంది మాత్రమే ప్రయోజకులయ్యారు .కొందరు బ్రెయిన్ డ్రయిన్ పేరుతో విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు.భారతదేశంలో ప్రతిభకు ఢోకా లేదు.మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి. వ్యవస్థీకృతమైన విధానాలలో ఉన్న లోపాల వల్ల,మనం చైనా,మరికొన్ని దేశాలను దాటి ముందుకు వెళ్లలేకపోయాము.విద్యా విధానం సక్రమంగా, ఫలవంతంగా ఉండి ఉంటే,ఎన్నో దేశాలను ఈపాటికే అధిగమించి వుండే వాళ్ళం.ఈ ఆధునిక విద్యా విధానంరాక ముందు,మనం జ్ఞాన స్వరూపులం. భారతదేశం జ్ఞానభూమిగా వాసికెక్కిన చారిత్రక వైభవం గతంలోకి వెళ్ళిపోయింది.అపారమైన జ్ఞానానికి నెలవైన వేదభూమి మనది.లార్డ్ మెకాలే మొదలు,ఎందరో పాశ్చాత్యులు మన మూలాలనే దెబ్బతీశారు. అటు సంప్రదాయ జ్ఞానం లేదు. ఇటు కావాల్సినంత అత్యాధునికత లేదు.ఇన్నాళ్లకు,ఇన్నేళ్లకుకేంద్ర ప్రభుత్వం కదిలి వచ్చి,కొత్త విద్యా విధానంతీసుకువచ్చింది.ఇందులో కొన్ని బాగున్నాయి,కొన్ని ఆచరణకు దూరంగా ఉన్నాయి.మరికొన్ని సమగ్రతకు దగ్గరగా లేవు.విద్యా విధానంపై తరచూ పునః సమీక్షలు చేసుకుంటూ ముందుకు సాగాలి.బోధనలో ఎడ్యుకేషనల్ సైకాలజీనిమరువ రాదు. న్యూరోలాజికల్, బయోలాజికల్ అంశాలు కూడా పరిగణలోకి తీసుకోవాలి.నూతన విద్యా విధానంపై ఇంకా అధ్యయనాలు జరగాల్సిన అవసరం ఉంది.కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చాలా ముఖ్యం.ఫెడరల్ వ్యవస్థలో విద్యారంగం ఉమ్మడి లిస్ట్ (కాన్ కరంట్) లో ఉంది.సబ్జక్ట్స్ తో పాటు బోధనా భాష కూడా ముఖ్యమైంది.ఇది కేవలం భాషాపరమైన అంశం కాదు. విద్యార్థి మానసిక స్థాయి, గ్రహణశక్తికి కూడా సంబంధించిన విషయం.జాతీయ విద్యా విధానమంతా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు.ఆరోగ్య,న్యాయ విద్యలను ఎందుకు ప్రత్యేకంగా ఉంచారో స్పష్టత రావాలి.విద్యార్థి దశలోబాల్యం చాలా కీలకమైంది.ముఖ్యంగా 10-11ఏళ్ళ వయస్సు వరకు మాత్రమే మెదడూ ఎదుగుతూ ఉంటుంది.ఆ తర్వాత ఎదుగుదల పెద్దగా ఉండదని నిపుణులు చెబుతున్నారు.కాబట్టి,మనం ఇచ్చే ఆహారం,కల్పించే వాతావరణం,బోధనా విధానాలు చాలా చాలా కీలకమైనవి.వివిధ వయస్సుల్లో,మెదడు ఎదుగుదలకు తగ్గట్టుగా చదువులు ఉండాలి.ఐదవ తరగతి వరకూ,అంటే కనీసం 10ఏళ్ళ వయస్సు వరకూ మాతృభాషలో లేదా స్థానిక భాషలో బోధన ఉండడమే సరియైన పద్ధతి.గ్రహణశక్తి ఈ భాషలకే ఉంటుంది, అంతర్జాతీయ, జాతీయ భాషలను ఒక సబ్జెక్టుగా ఉంచితే సరిపోతుందని భాషా శాస్త్రవేత్తలు,ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్సు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయంగా ఉపయోగపడే ఇంగ్లిష్ విద్యా బోధన 10-11ఏళ్ళ వయస్సు నుంచి ప్రవేశపెట్టవచ్చు. ఉన్నత విద్యలోకి చేరేంత వరకూ తప్పనిసరిగా మాతృభాషఒక సబ్జెక్టుగా ఉండాలి.భాషా సంస్కృతులపై విద్యార్థికి తప్పకుండా అబిమానం,ప్రేమతో కూడిన అవగాహన కల్పించాలి. సంస్కృతిని విద్యార్థి సొంతం చేసుకోవాలి.సబ్జక్ట్స్ తో పాటు కళలు,యోగా,ఆటలు,వినోదాలు కూడా చాలా అవసరం.సరికొత్త విద్యావిధానంలో వీటిని కూడా ఇప్పుడు చేర్చారు.ఇది మంచి పరిణామమే.వృత్తివిద్యను కూడా జోడించి,బోధన సాగించాలనేది కూడా మంచి ఆలోచన.ఒక్కొక్క రాష్ట్ర ప్రభుత్వం,ఒక్కొక్క విద్యా విధానం పాటించడం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు.విద్యా విధానంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలి.కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలి.హక్కులు-అవసరాలు-ఆచరణ- సంస్కృతి-సంప్రదాయం -సామాజిక స్వరూపం మొత్తాన్ని దృష్టిలో ఉంచుకొనే రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉండాలి. చదివిన చదువు విద్యార్థికి, కుటుంబానికి,రాష్ట్రానికి,దేశానికి ఉపయోగపడినప్పుడే విద్య ప్రయోజనం సంపూర్ణంగా నెరవేరుతుంది.6వ తరగతి నుంచే వృత్తి విద్యను ప్రవేశపెట్టడం పై మిశ్రమమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ వయస్సులోనే ఈ విధానాన్ని రుద్దకుండా చెయ్యడం ఎంతవరకూ సబబు?అని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఎం.ఫిల్ ఎత్తివేయడం మంచి ఆలోచన.అదే సమయంలో పి.హెచ్.డి ల్లో కూడా ఎక్కువ భాగం నాణ్యతలోపం ఉంది.మిగిలిన తరగతుల్లో,జ్ఞానం తక్కువ, సర్టిఫికెట్ ప్రధానంగా ఇప్పటి వరకూ నడిచాయి.పరిశోధనల్లో ప్రతిభ, ప్రావీణ్యతలు ముఖ్యం.అది ఏ సబ్జెక్టు అయినప్పటికీ, కఠినమైన పర్యవేక్షణ ఉండాలి.విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు సమృద్ధిగా ఉండాలి. ఉపాధ్యాయుల శిక్షణ, నియామకాల్లో కఠినమైన, నిష్పక్షపాతమైన,సమగ్రమైన వైఖరి అవలంబించాలి.ప్రతి సబ్జెక్టుకూ ప్రాముఖ్యత ఉండాలి.ప్రతి చదువూ ఉపయుక్తంగా ఉండాలి.ప్రతిభకు పెద్ద పీట వెయ్యాలి.సోమరిపోతుల చీటీ చించెయ్యాలి. ఐ.ఏ.ఎస్,ఐ.ఆర్.ఎస్ లాగానే ఐ.ఇ.ఎస్ (ఇండియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్) ఏర్పరిస్తే బాగుంటుందని కొందరు మేధావులు చేస్తున్న సూచనలపై చర్చ జరగాలి. పరిశ్రమలు,వ్యాపార సంస్థలు, పరిపాలనా కార్యాలయాలతో విద్యార్థులను అనుసంధానం చెయ్యాలి.అలా సాగితే పెద్దల లేదా నిపుణులతో విద్యార్థులకు మెళకువలు,ఆచరణ,అమలులో ఉండే కష్టసుఖాలపై క్రాష్ కోర్సుల తరహాలో పాఠాలు చెప్పించాలి.ఆ సంస్థల్లో ప్రాజెక్టు వర్క్ చేయించాలి.జాతీయ విద్యా స్టాండింగ్ కమిటీ ఏర్పాటుచేసి, అందులో వివిధ రంగాల నిపుణులను సభ్యులుగా వెయ్యాలి.ఈ నియామకంలో పారదర్శకత ముఖ్యం.దాదాపు మూడు దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ విద్యా విధానం మొత్తంమీద బాగానే ఉందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. జ్ఞాన సముపార్జన నిరంతర ప్రవంతి. అద్భుతమైన ప్రాచీన విద్యా విధానం-అత్యాధునిక వ్యవస్థల సంగమంగా నూతన విద్యా వ్యవస్థ ఉండాలి.మూడు దశాబ్దాల వరకూ విద్యా విధానంలో సంస్కరణలు, మార్పులు చెయ్యకుండా ఉండడం మన ప్రభుత్వాల డొల్లతనానికి, బాధ్యతా రాహిత్యానికి అద్దం పట్టాయి.ఇకనుంచైనా, ఎప్పటికప్పుడు సమీక్షలు, సంస్కరణలు, ఆచరణలతో భారతీయ విద్యావిధానాన్ని ప్రపంచంలోనే తలమానికంగా నిలబెట్టాలి.విద్య-ఉపాధి-ప్రగతి కలిసి సాగాలి.చదువుల కోసం, ఉద్యోగాల కోసం ఇంకా విదేశాల వైపే చూస్తున్నాం.అది ఆగినప్పుడు మాత్రమే ,మన ప్రగతి ప్రయాణం మరింత దూసుకు వెళ్లినట్లవుతుంది .

భారతీయ గ్రంథాలు..కీర్తి సంకేతాలు

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంధ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంధ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంధానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్ధశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాధా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంత కాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జ పత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవు తాయి. మనిషి అజ్ఞానంతోనో, తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంధాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసు కెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వ్మాయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రాతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తానత్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంధాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంధాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడు కునేది. ముద్రణా యంత్రాల ఆధునీ కరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అంద మైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడు తున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవు తున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంధాలు, సృజనా త్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ఇలాంటి స్థితిలో పుస్తక ప్రదర్శన నిర్వహించడం చాలా ఉపయుక్తం. 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయ వాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 1980ల్లో రాజమండ్రిలో ఒక దశాబ్దం పాటు పుస్తక మహోత్సవాన్ని అక్కడి నిర్వాహకులు నిర్వహించారు. ఆ పుస్తక ప్రదర్శనలో భాగంగా విజయ వాడలోని ప్రముఖ ప్రచురణ కర్తలు పుస్తక దుకాణాల యజమానులు పాల్గొనేవారు. రాజమండ్రి పుస్తక ప్రదర్శన నిలిపి వేయడంతో నేషనల్ బుక్ ట్రస్ట్ సహాయంతో 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయవాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆ స్ఫూర్తితో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా విజయ వాడ పుస్తక మహోత్సవం గత 34 ఏళ్లుగా విజయ వాడ నగరంలో కొనసాగించడం అభినందనీయం. బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే అవుతుంది. అందుకే చాలా మందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూతులను మిగులుస్తుంది అనేది నూటికి నూరు పాళ్ళు నిజం.

రామ కిష్టయ్య సంగనభట్ల

జాతిని బలహీనపరిచే దానిని త్యజించాలి

"నిన్ను బలహీనపరిచేది ఏదైనా కానీ, దానిని త్యజించు." అన్నారు స్వామి వివేకానంద. ఇది మనిషికే కాదు జాతికి వర్తిస్తుంది. జాతిని బలహీనపరచేది ఏదైనా దానిని త్యజించాలి. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఉదాహరణకు మన సోషల్ మీడియాను తీసుకుంటే దీనివలన మనకు ముప్పపొంచివుందని తెలిసినా దానిని వదల్లేని పరిస్థితి. ప్రతి మనిషికీ ఆండ్రాయిడ్ ఫోన్, ఇంటర్నెట్ తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి ఎదురైనది. ఇప్పుడు దానిని అడ్డం పెట్టకొని అరాచక శక్తులు కుయుక్తులు పన్నుతున్నాయి. ఆకతాయిగా వ్యవహరిస్తూ దేశానికి కోట్లలో నష్టాన్ని తెస్తున్నది. రోజూ విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపులు, తిరుమలలో బాంబులు న్నాయని వస్తున్న సమాచారమే దీనికి తార్కాణం. దీనికి వేదిక సోషల్ మీడియానే. తిరుపతిలో విదేశీయులు బసచేసే హోటళ్లలో బాంబులున్నాయన్న సమాచారం ఐఎస్ ఉగ్రవాదుల పేరిట పోలీసులకు చేరడం, వారు ఆయా హోటళ్ల లో తనిఖీలు చేపట్టడం కొనసాగుతున్నాయి. దీనిపై ఇప్పటికీ అరుకేసులు నమోదు చేసినట్టు తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు తెలియజేశారు. మరోవైపు దేశీయ విమానాల కు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. ఈ నెల 27 ఒక్కరోజే సుమారు 50 విమానాలకు ఈ బెదిరింపులు వచ్చాయి. ఇది ఒక్కరోజూ రెండు రోజులూ కాదు. 14 రోజుల్లో 350కి పైగా ఇటువంటి బెదిరింపు సమాచారాలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్లోకి దిగింది. ఈ సమాచారం "ఎక్స్" వేదికగానే వస్తున్నదని, దానికి ఆ నిర్వాహకులు బాధ్యత వహించాలని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ఐటి మంత్రిత్వశాఖ సామాజిక మాధ్యమ వేదికలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కె. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ "ఐటి నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోపు తప్పుడు సమాచార వ్యాప్తిని తొలగించ డం, లేదా నిలిపివేయడం చేయాల్సిఉందన్నారు. ఇటువంటి చట్ట వ్యతిరేక, హానికరమైన సమాచార వ్యాప్తికి తమ వేదికలు ఉపయోగపడకుండా మధ్యవర్తులు (సోషల్ మీడియా) జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. దేశ సమగ్రతకు, భద్రతకు, సార్వభౌమాధికారానికి ముప్పుగా పరిణమించే సమాచారాన్ని తొలగించడమే కాకుండా తమ యూజర్లు అందుకు కారణమైతే వారిపై 'భారతీయ నాగరికి సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)- 2023 క్రింద సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన అదనపు బాధ్యత కూడా సామాజిక మాధ్యను వేదికల నిర్వాహకులపై ఉంటుందని, బాధ్యతల నిర్వహణలో విఫలమైన వారిపై 'భారతీయ న్యాయ సంహిత-2023 ప్రకారం చర్యలు తీసుకుంటామని" హెచ్చరించారు.దీనిని బట్టి సోషల్ మీడియా నిర్లక్ష్య ధోరణి అవగతమవుతున్నది. ఇదిలా ఉండగా ఇటీవల జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న "నెగటివ్ సరేటివ్" అనగా అబద్ధపు వ్యాసాలు, తప్పుడు కథనాలు, భారతీయ జాతిని కించపరిచేలా, అబద్ధాలతో అల్లిన స్టోరీలకు తగిన రీతిగా స్వదేశీయులు స్పందించాలని పిలుపునిచ్చారు. ఇది నిజంగా కలవర పరిచే అంశం. ఇది ఎప్పట్నుంచో సాగుతున్నది. ఇప్పటికి అధికారులే నేరుగా రంగంలోకి దిగి బాహాటంగా మాట్లాడారంటే పరిస్థితి ఎంతటి విషము స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. కేవలం యూజర్లో నెటిజన్లో కాకుండా 'ఎఐ' కూడా ఇందులో భాగం తావడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఇటీవల వాట్సాప్కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సుదుపాయాన్ని అదనంగా అందించారు. ఒకవైపు గూగుల్ ఉండగా మళ్లీ దీని అవసరం. ఏమిటోతెలీదు. కానీ ఏ విషయాన్నైనా క్షణాల్లో మనముందుంచుతుంది. అంతేకాదు రాహుల్ గాంధీ గురించి అడిగారనుకోండి 'అతడొక గ్లోబల్ సిటిజన్ అని, దేశ అభి వృద్ధి గురించి పాటుపడే వ్యక్తినీ చాలా పోజటిదిగా చెబుతుంది. అదే మోదీ గురించి ప్రశ్నిస్తే అంత గొప్పగా చెప్పదు. ఇది గమనించాల్సిన అంశం. ఏమీ తెలియని యూత్ గనక దీనిని ఆశ్రయిస్తే వారు ఇదే నిజమనుకొనే అవకాశం లేక పోలేదు. అజిత్ దోవల్ వంటివారు రంగంలోకి దిగి హెచ్చరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్న అంశాన్ని పరిశీలిస్తే గణాంకాల ప్రకారం వాట్సప్ నుంచి సందేశాలు పంపేవారిలో నెలకు 69.6 మిలియన్ల మెసేజ్లు పంపుతున్నది ఇండియన్స్. సోషల్ మీడియాకు పెద్ద మార్కెట్ ప్రదేశం కూడా ఇండియానే. మనజాతిని బలహీనపరిచే విధంగా సోషల్ మీడియా వ్యవహరిస్తున్నది అని తెలిసినా వెంటనే త్యజించ లేని పరిస్థితి సమాజంలో నెలకొన్నది. అంటే అప్పుడు ఆంగ్లేయులకు బానిసలైనట్లు ఇప్పుడు సోషల్మీడియా బానిసలయ్యామా? అంటే మరో స్వాతంత్ర్యపోరాటం తప్పదా?

నట్టి శ్రీనివాస్‌రావు

నరక నివారిణి - నరక చతుర్దశి

పండుగల సముదాయంతో ప్రారం భమై పండుగల సముదాయంతో ముగిసే నెలగా ఆశ్వయుజ మాసం ప్ర త్యేకతను సంతరించుకొంది. పదిరోజు ల దసరా సంబరాలతో మొదలయ్యే ఈ నెల ధనత్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి అమావాస్యలతో ముగుస్తుం ది. దీపావళి అమావాస్య తర్వాత బలి పాడ్యమి , యమ ద్వితీయ పండుగల ను జరుపుకొంటాము. ఇలా దీపావళి సందర్భంగా ఐదు రోజులూ పండుగలే. వెంటనే దీపాల మాసంగా పేరుపొందిన కార్తీక మాసం, విష్ణుపూజకు విశిష్టమైనదిగా చెప్పబడిన మార్గశిర మాసం వస్తాయి.ధనత్రయోదశి ఉత్తర భారత దేశం లో చాలా ప్రముఖంగా జరుపుకోబడే పండుగ. లక్ష్మీ ఆరాధనకు, పసిడి కొనుగోలుకు ధనత్రయోదశి అనువైనదిగా భావిస్తారు. ఉదయమే ఇంటిని శుభ్రపరచి, గృహాలంకరణ గావించి, పిండి వంటలతో పండుగ చేసుకొంటారు. ఆరోజు సాయంత్రం క్రొత్తగా కొన్న ఆభరణాలను, ఇంట్లో ఉన్న ధన, కనక రాశు లను లక్ష్మీదేవి ప్రతిమకు అలంకరించి పూజిస్తారు. అలాచేస్తే ఆ ఇంట ఎటువంటి కొరత ఉండదని, సిరి సంపదలు వెల్లివిరుస్తాయని విశ్వసిస్తారు. అదే రోజు రాత్రి స్నానాలగదిలో వేడినీళ్ళు కాచే భారీ పాత్రలను శుభ్రపరచి, వాటి ని స్వచ్ఛమైన నీటితో నింపి, పసుపు కుంకుమలతో అలంకరించి, పసుపు తాడుతో చేసిన కంకణాన్ని పాత్ర కంఠానికి కట్టి, మరుదినమైన నరక చతుర్దశినాటి ప్రాతఃకాలా న ఇంటిల్లిపాదీ అభ్యంగన స్నానాలు చేయడానికి వీలుగా ఏర్పాటు చేస్తారు. కొన్ని ప్రాంతాలలో దీన్ని ' నీళ్ళునింపే పండుగ 'గా పేర్కొంటారు. నరక చతుర్దశి నాడు సూర్యోదయా నికి ముందే ఇంటిల్లిపాదీ నువ్వుల నూనెతో నలుగు పెట్టుకొని, సువాసన గల పువ్వులు, ఔషధీ సంపన్నములైన వివిధ ఆకులను వేసి కాచిన నీటితో అభ్యంగన స్నా నాలు చేస్తారు. స్నానాలకు ముందు నరకాసురుని రూపంలో గడ్డిబొమ్మను చేసి, దానిని దహనం చేయడంకూడా కొన్ని ప్రాంతాలలో ఉంది. ఈరోజు నూనెలో లక్ష్మి, నీటిలో గంగ నెలకొని ఉంటారనీ, చలికాలం ప్రారంభం కాబోతున్న తరుణం కనుక సూర్యోదయా త్పూర్వమే నువ్వుల నూనెతో శరీరా న్ని మర్దించుకోవడం వలన చలికి చర్మ ము పెళుసుబారకుండా, మృదువుగా ఉంటుందనీ పెద్దలంటారు. " నరక నివారిణి జాహ్నవి గంగే ! " అని స్తోత్రం చేస్తూ, ఈరోజు స్నానం చేయడంవలన గంగాదేవి నరక బాధలకు మనలను దూరంచేస్తుందని నమ్ముతారు.నరక చతుర్దశి అంటే పితృదేవతల కు, వారి సంతతికి నరకబాధలనుండి విముక్తి కల్పించే దినమని అర్థం. నర కాసురుని సత్యభామా సమేతుడై, శ్రీ కృష్ణుడు సంహరించిన రోజు కూడా ఇదే కావడంతో ఈ ఆశ్వీయుజ బహుళ చతుర్దశిని నరక చతుర్దశిగా వ్యవహరి స్తారని పురాణ కథనం. నరక చతుర్దశి నాడు తైలాభ్యంగన స్నానం, దీప ప్రజ్వలనం, దీపదానం, యమతర్పణం, ప్రధానమైనవి. పితృ దేవతల ప్రీత్యర్థం వారికి తర్పణాలు వదులుతారు. కనుక దీనికి ప్రేతచతుర్ద శి, కాలాచౌదస్, కాళ చతుర్దశి, కాళరా త్రి అనికూడా పేర్లున్నాయి. నరకలోక వాసులకు పుణ్యలోక ప్రాప్తిని కలిగించే పండుగగా, తమకు నరకలోక ప్రాప్తి లే కుండా చేసుకొనే పండుగగా నరక చతు ర్దశిని భావిస్తారు ప్రజలు.అభ్యంగన స్నానం చేశాక నువ్వుల నూనెతో ఇంటిలోను, ఆవరణలోను, తులసి కోట వద్ద, ఇంటి దక్షిణదిక్కున దీపాలు వెలిగిస్తారు. చీకటిమయమైన పాపలోకాలనుండి తేజోమయములైన పుణ్యలోకాలకు ఈ దీపాలు మన పిత రులకు దారి చూపుతాయని పురాణా లు చెబుతున్నాయి. దీపాలనువెలిగిం చడం ఐశ్వర్యానికి, జ్ఞానానికి, శుభాని కి సంకేతం. సూర్యునికి దివిటీ పట్టిన ట్లుగా ఆ పరంజ్యోతి స్వరూపునికే ఈ చిరుదీపాలను దర్శింపజేసి తమలో ఆత్మజ్యోతిని ప్రకాశింపజేయమని జనులు భగవంతుని ప్రార్థిస్తారు. ఈ నరక చతుర్దశినాడు దీపదానం చేయ డం కోటి యజ్ఞాలు చేసిన దానితో సమానమైన ఫలితాన్నిస్తుందని ప్రాచీ న కాలంనుండి విశ్వసింపబడుతోంది."కాళరాత్రి " గా పేరొందిన ఈ నరక చతుర్దశినాడు కాలుని ఆరాధన తప్ప నిసరి. కాలుడు అంటే యముడు. అయితే కాలుడు, యముడు అనేవి కూడా ఆ పరమాత్ముని పేర్లే. "కాలోస్మి లోక క్షయకృత్ ప్రవృద్ధో " అని భగవద్గీ త, " నియంతా నియమో యమః " అని విష్ణుసహస్రనామం ఈ విషయాన్ని ధృఢ పరుస్తున్నాయి. యముడనే పేరుతో పితృలోకాధిపతిగా వ్యవహరి స్తున్న యమధర్మరాజుకు సభక్తికంగా ఆయన అధిపతియైన దక్షిణ దిక్కున ' యమదీపం ' వెలిగించడం, యముని పేరుతో మూడు సార్లు తర్పణం వదల డం నరక చతుర్దశినాడు చేస్తే యమ గండాలు, అకాల మృత్యు పీడ, నరక లోక బాధలు ఉండవని చెబుతాయి శా స్త్రాలు. యమునికి తర్పణం వదిలేట ప్పుడు ఉత్తరేణి ఆకులను వ్యక్తి తన తలపై ఉంచుకోవాలి. దక్షిణాభి ముఖం గా కూర్చొని, " యమాయ ధర్మరాజా య మృత్యవేచాంతకాయచ/ వైవస్వ తాయ కాలాయ సర్వభూత క్షమాయ చ/ ఔదుంబరాయ దధ్నాయ నీలాయ పరమేష్ఠినే/ వృకోదరాయ చిత్రాయ చి త్రగుప్తాయ వై నమః " అని యమనా మాలు జపిస్తూ, నువ్వులతో మూడు మార్లు తర్పణం వదలాలి. ఇది అప మృత్యుహరం. ఇలా చేసినవారు యమలోకం చూడరని ఆస్తికుల విశ్వా సం.నరక చతుర్దశినాడు విధిగా నువ్వు లతో చేసిన అప్పాలు, మినప గారెలు భగవంతునికి ప్రత్యేక నివేదన చేసి భు జిస్తారు భక్తులు.ఇక ప్రదోష సమయంలో దీపాల వరుసతో ఇళ్ళను, దేవాలయాలను, మఠాలను, ఉద్యాన వనాలను అలంక రించడం, నరకాసురుని పీడ తొలగిం దని బాణాసంచా కాల్చడం చేస్తారు. నరక చతుర్దశినాటి ఉదయం మొదలైన దీప ప్రజ్వలనం కార్తీకమాసం చివరి వరకూ ఒక పవిత్ర కార్యక్రమంగా, దీపోత్సవంగా, దీపయజ్ఞంగా సంబరంగా కొనసాగుతుంది. మనలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞాన జ్యోతి వెలుగులతో పరిసరాలన్నింటినీ తేజోమయం చేయడమే ఈ దీపాల పండుగ ఆంతర్యం.

గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

దీపావళి-పౌరాణిక అంశాలు

పూర్వం శ్రీరాముడు రావణుని వధించి, సీతాలక్ష్మణ సమేతుడై అయోధ్యకు తిరిగి వచ్చినది అమావాస్య నాడే! ఆనాటి సంతోషకర సంఘటనకు గుర్తుగా, సీతారాములను ఆహ్వానించేందుకు సూచికగా, పౌరులు నగరాన్ని ఆవునేతి దీపాలతో అందం గా అలంకరించారట. శ్రీరాముడు లేని రోజులన్నీ తమ మనసులకు చీకటి రోజులని, సీతారాముల పునరాగమన ము తమ జీవితాలకు వెలుగు నిచ్చింద ని, తమ సంతోషాన్ని తెలుపడానికే దీపాలు వెలిగించడమని భావింప బడుతోంది.మహాభాగవతంలో, పదహారువేల మంది స్త్రీలను చెరబట్టి, దేవమాత అయిన అదితి యొక్క కర్ణకుండలాల ను అపహరించి, త్రిలోక కంటకుడై, ప్రాగ్జ్యోతిష పురం రాజధానిగా (ఇప్పుడు అస్సాం) పాలిస్తున్న నరకాసురుని, సత్యభామా సమేతుడై శ్రీకృష్ణుడు సంహరించిన మరుసటి రోజును ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళిగా జరుపుకొన్నారు. నరకునికి తల్లిచేతిలో తప్ప ఇతరుల చేతిలో మరణం ఉండదు అనే వరముండినది "ఇల్లాలిన్ కిటియైన కాలమున మున్నే నంచు ఘోషింతువో/ తల్లీ! నిన్ను దలంచియైన నిచటన్ తన్నున్ కృప కావడే/ చెల్లెన్ బో తలద్రెంచె నంచు నిల నాక్షేపించు చందంబునన్/ త్రెళ్ళెన్ చప్పుడు కాగ భూమిసుతుడు ద్దీప్తాహవక్షోణిపై" (భాగవతం). సత్య భామా శ్రీకృష్ణుల శరాఘాతాలకు నేలకొరుగుతూ, "అమ్మా, నీవు శ్రీహరి వరాహావతారమెత్తినప్పుడు, అతని ముద్దుల భార్యగా అలరారిన కాలంలో జన్మించిన నన్ను, నీ ముఖము చూచైనా విడచిపెట్టక ప్రాణం తీశాడు కదా!" అని భూదేవి అవతారమైన సత్యభామను ఆక్షేపిస్తూ నరకుడు నేల కూలాడని పద్య భావం. దుర్మార్గులైన వారు, తన సంతానమైనా సరే, భగవంతుడు శిక్షిస్తాడనడానికి నరకుని కథ ఒక ఉదాహరణ మాత్రమే!నరక చతుర్దశి రోజు సూర్యుడు తులారాశిలో, చంద్రుడు స్వాతీ నక్షత్రం లో ఉండటం జరుగుతుంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం ఇది అత్యంత విశేష మైన అంశం. తులారాశిలో సూర్యుడు సంచరించే సమయంలో నదుల, సముద్రాల జలాలలో విశేష శక్తి దాగి ఉంటుందని, ఆ నది లేక సముద్ర జలాలలో తలస్నానం చేసేవారికి ఆయురారోగ్యైశ్వర్యాలు లభిస్తాయంటుంది జ్యోతిష శాస్త్రం. దీపావళి రోజున శ్రీరామ, శ్రీకృష్ణుల నే కాక లక్ష్మీదేవిని కూడా పూజించ డానికి కారణాలున్నాయని పురాణాలు చెప్పాయి. విష్ణు, మార్కండేయ పురాణాలలో దీపావళి రోజులలో లక్ష్మీ పూజ తప్పక చేయాలని, అలా చేయటం విశేష ఫలదాయకమని చెప్ప బడింది. దేవదానవులు అమృతం కోసం క్షీరసాగరమథనం చేసినప్పుడు విశేష వస్తు సముదాయాలు ఉద్భవిం చాయి. త్రయోదశిరోజు దేవ వైద్యుడు ధన్వంతరి, అమావాస్య నాడు లక్ష్మీ దేవి జన్మించారు. ధనంపై ఆధిపత్యం కలిగిన లక్ష్మీదేవి దేదీప్యమానంగా వెలిగే దీపం యొక్క ప్రతిరూపం కలిగినది. విష్ణువు ఆమెను స్వీకరించి తన వక్షస్థలంలో నిలుపుకొన్నాడు. ఆమె ఎనిమిది రూపాలలో అలరారుతూ, అష్టలక్ష్ములుగా పూజలం దుకొంటూ, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని ప్రజల నమ్మిక. ఇంట్లో ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవే పుట్టిందని, ఆ పాప వలన ఇంటికి అదృష్టం, ఐశ్వర్యం సిద్ధిస్తా యని అంటారు. ఏ ఇంటిలోదీపాలు వెలుగుతూ ఉంటాయో ఆ ఇంట్లో లక్ష్మీ దేవి ప్రవేశిస్తుందని విశ్వసించి, ఇరు సంధ్యలలో దీపాలు వెలిగిస్తారు. దీప ప్రజ్వలన వలన చీకటి, అజ్ఞానం, శోకం పారద్రోలబడి ఆరోగ్యైశ్వర్యాలు సమకూరుతాయి.

ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి

నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో

పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధ సారథి

రూ. 10 లక్షలతో 2 సిసి రోడ్లు మంజూరు

నూజివీడు అక్టోబరు, 28 (ఆంధ్రపత్రిక) : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవచూపాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి తెలిపారు. నూజివీడు రూరల్ మండలం పోతిరెడ్డిపల్లిలో సోమవారం రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో 2 సిసి రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్థంభాల ఏర్పాటుపై సంబంధిత డిఇ తో మాట్లాడి వారంరోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామస్థులు కోరిన చేతిపంపు విషయంపై ఆయన స్పందిస్తూ పంపు ఎక్కడ వేయాలి తదితర వివరాలను యంపిడివోకు అందజేస్తే పంపు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

గ్రామ సమీపంలోని అట్ల ఫ్యాక్టరీ నుంచి వచ్చే విషపూరితమైన నీరు చెరువులో కలుస్తోందని వచ్చిన ఫిర్యాదుపై మంత్రి స్పందిస్తూ సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఆర్డిఓ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఇకపై ఫ్యాక్టరీలో నీటిని శుద్ధిచేసే యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలని, శుద్ధిచేసిన నీటిని మాత్రమే బయటకు వదలాలని ఆయన స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామ పడపర ప్రాంత రోడ్డు సమస్యను స్థానిక తహశీల్దారు, విఆర్‌ఓలు పరిశీలించి సమస్య పరిష్కరిస్తారని ఆయన చెప్పారు. ఎస్సీ స్మశానవాటికి కు సంబంధించిన రహదారి విషయంపై మంత్రి స్పందిస్తూ ఇందుకు సంబంధించిన 29 సెంట్ల భూమి విషయంపై జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడతానని అదే విధంగా స్థానికంగా ప్రత్యమ్నాయ చర్యల కోసం కూడా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు బి. సుబ్బారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు పూర్తిస్థాయిలో సిద్ధంకండి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డా.నిధిమీనా

విజయవాడ, అక్టోబర్ 28, (ఆంధ్రపత్రిక) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయిలో సిద్దంకావాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ నిధి మీనా.. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు తదితరులతో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నవంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నైపుణ్య గణన సర్వే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని.. సిబ్బందిని సమాయత్తం చేయాలని సూచించారు. మంగళవారం ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున సచివాలయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ల ద్వారా క్షేత్రస్థాయిలో సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక-ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ఉపాధి వివరాలు, నైపుణ్యాలు, ఆకాంక్షలు తదితర 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సంబంధించి అక్టోబర్ 31 సెలవుదినం కావడంతో 30వ తేదీనే బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసి.. నవంబర్ 1, 2 తేదీల్లో పెన్షన్ పంపిణీని పూర్తిచేయాలని సూచించారు. 2,33,248 మంది పెన్షన్‌దారులకు రూ. 99.45 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. నవంబర్ 1వ తేదీ ఉదయం ఆరు గంటలకే పంపిణీని ప్రారంభించాలని సూచించారు. అదే విధంగా నీటి వినియోగదారు సంఘాల ఎన్నికలపైనా నిధి మీనా సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో లావణ్య, ఎన్‌ఎస్‌పీ-ఇరిగేషన్ ఎస్‌ఈ శివరామకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమమైనింగ్ పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలి

నూజివీడు అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : నూజివీడు ఆర్డీవో ఆఫీస్ లో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసన సభ్యులు ముద్దర బోయిన వెంకటే శ్వరరావు పాల్గొని నూజివీడు నియోజక వర్గంలో ప్రభుత్వ అను మతులు లేకుండా ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు అయిన కొండల అక్రమ మైనింగ్ కి పాల్పడుతూ ప్రభుత్వ ఖజానాను లూటీ చెస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుల పై చర్యలు తీసుకోవలసినదిగా కోరుతూ మరియు నూజివీడు మండలం లోని సిద్దార్ధ నగరం, సుంకొల్లు గ్రామాల అడవి భూమి లో సాగు చేసుకుంటున్న పేద రైతుల భూములు సుమారు వంద ఎకరాలు డబ్బు ఆశ చూపించి కొనుక్కునేందుకు ప్రయత్నించిన భూ దందాదారులపై చర్యలు తీసుకొని పేదల భూములను రక్షించవలసినదిగా కోరుతూ ఆర్డీవో వినతిపత్రాని అందించారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

గేట్ ఐయిఎస్ ఆన్లైన్ తరగతులపై అవగాహన

నూజివీడు అక్టోబర్ 28(ఆంధ్రపత్రిక) ; చెందిన "మేడ్ ఈజీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్" సహకారంతో ఆర్జీయూకేటీ నూజివీడు యొక్క "హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్" ఆర్జీయూకేటీ నూజివీడు మరియు శ్రీకాకుళం విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ తరగతులు మరియు గేట్ , మరియు ఐయిఎస్ పరీక్షల కోసం టెస్ట్ సిరీస్‌లను అందించే లక్ష్యంతో స్కాలర్‌షిప్ పరీక్షతో పాటు సమాచార అవగాహన సెషన్‌ను నిర్వహించారు. మేడ్ ఈజీకి చెందిన సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ శ్రీ జితేంద్ర తివారీ ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వ్యవహరించారు. తన ప్రసంగంలో,. తివారీ, గేట్, మరియు ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టి సారించారు, వివిధ కెరీర్ అవకాశాలను చర్చించారు మరియు టాపర్‌గా ఎలా ఉండాలనే దానిపై విలువైన చిట్కాలను పంచుకున్నారు. సమర్థవంతమైన గమనికలను రూపొందించడం యొక్క ప్రాముఖ్యతను కూడా అతను నొక్కిచెప్పారు మరియు రిక్రూట్‌మెంట్ యొక్క వివిధ దశలను విజయవంతంగా నావిగేట్ చేయడానికి వ్యూహాలను అందించారు. సెషన్‌కు మంచి స్పందన లభించింది, ఇంత ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌చార్జి ఎం. రామకృష్ణను డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ తో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి. లక్ష్మణరావు అభినందించారు.

ఏకగ్రీవంగా ఒమ్మ వరం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్

రావికమతం అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : వివిధ కారణాలవల్ల నిలిచిపోయిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు సోమవారంతో ముగిశాయి. మండలంలో ఒమ్మ వరం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గా శనివాడ నానాజీ, వైస్ చైర్మన్ గా గల్లా నీలవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుండి భూ రిసర్వే గ్రామసభలు: తాసిల్దార్ రాజ్ కిషోర్

మొగల్తూరు అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) ; మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామంలో ఈనెల 29వ తేదీన,శేరేపాలెం గ్రామాలలో ఈనెల 30వ తేదీన రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మొగల్తూరు మండల తాసిల్దార్ రాజే కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే గ్రామసభలు నిర్వహించి గ్రామంలో భూమి గల సమస్యల నుండి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయునున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో రైతులకు తగిని సమాచారాన్ని గ్రామస్థాయి అధికారులు వెంటనే అందజేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రెండవ పంటకు నీటి కోసం రైతుల ఎదురుచూపులు

ఎమ్మెల్యే కాగిత పైనే ఆశలు

పెడన అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : పెడన నియోజకవర్గంలో రెండవ పంట సాగు కోసం రైతులు ఎదురుచూ స్తున్నారు. లక్ష ఎకరాలు సాగులో ఉంది. ఇందులో బంటుమిల్లి కృత్తివెన్ను పెడన మండలాలకు రెండో పంట దాళ్వా అవసరం ఎంతైనా ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నియోజవర్గానికి రెండో పంట లేదు. అపరాలపైనే ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారు. అయితే అపరాల సాగుకు నేల అన్ని ప్రాంతాల్లోనూ అనువుగా లేదు. దీంతో ఆ ప్రాంతాల్లో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ఈ కారణ చేతనే దాళ్వా ను రైతులు కోరుకుంటు న్నారు. ముఖ్యంగా రామరాజు ఛానల్ కింద రైతులు రెండవ పంట ను గట్టిగా కోరుకుంటున్నారు. దాల్వా సాగు చేసి చాలా సంవత్సరాలు అవుతుంది. ఇప్పుడు రెండో పద్ధతి నీరు ఇస్తే పంట మార్పిడి జరిగినట్టుగా కూడా ఉంటుంది. ఫలితంగా చౌడు బారిన నెలలు కాస్త సారవంతమవుతాయని రైతులం టున్నారు. ఈ విషయంలో శాసనసభ్యులు కాగితా కృష్ణ ప్రసాద్ దృష్టి కేంద్రీకరించి తమకు రెండో పంట కు నీరు అందించేలాగా కృషి చేయాలని జింజేరు మాజీ సర్పంచులు కొమరిపాలెం వేణుగోపాల్ వెంకట రామయ్య అచ్చయ్య వారి పాలెం రైతులు కట్టా మధుసూదరావు కట్టా శ్రీనివాసరావు కోరుతున్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

బంటుమిల్లి అక్టోబర్28 (ఆంధ్రపత్రిక) ; పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామంలో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వాలు నమోదు కార్ర్యమాన్ని ప్రారం భించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూనపురెడ్డి వీరబాబు, బొర్రా కాశి, తది తర ముఖ్య నాయకులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మండలంలోని బీచ్ రిసార్ట్సలను తనిఖీ చేసిన ఎస్ఐ

వేటపాలెం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : మండలంలోని సముద్రతీరంలో ఉన్న పలు బీచ్ రిసార్ట్ లను, వాటిలో ఏర్పాటుచేసిన లాడ్జిలను సోమవారం స్థానిక ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా పలు రిసాట్లను, సందర్శకుల రిజిస్టర్లను పరిశీలించడం జరిగిందన్నారు. రిసార్ట్స్ యజమానులతో మాట్లాడుతూ సందర్శకుల పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాతే రూమ్స్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై విమర్శలేంటీ?

– టీడీపీపై వైసీపీ మండిపాటు!

కాకినాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : బాణాసంచా దుకాణాల కేటాయింపులో జరుగుతున్న అవినీతిని కప్పిపుచ్చు కునేందుకే తెలుగుదేశం నేతలు మాజీ ఎమ్మెల్యే ద్వారం పూడి చంద్రశేఖర రెడ్డి పై విమర్శలు చేస్తు న్నారని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్ప టికీ అధికారులు ద్వారంపూడి మాటే వింటున్నారంటూ టీడీపీ నగరాధ్యక్షుడు మల్లిపూడి వీరు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆర్డీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై నిరసన తెలియజేయ డాన్ని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం టీడీపీ తమపై చేసిన తీరుపై సుంకర ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాలు కేటాయింపులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. గతంలో నగర పాలక ఆధ్వర్యంలోనే డ్రా తీసి దుకాణాలు కేటాయించేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త సంస్కృతికి తెరలేపి ఓ లాడ్జిలో డ్రా తీసి నచ్చిన వారికి దుకాణాలు కేటాయించుకుంటున్నారని మండిపడ్డారు. ద్వారంపూడి, వైసీపీ కానీ దుకాణాల కేటాయింపుపై అధికారులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదన్నారు. తమ అక్రమాలు బయటపడతాయనే భయంతో ద్వారంపూడిని వివాదంలోకి లాగి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విద్యాసాగర్ విమర్శించారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసి పనులు చేయించుకోవాలని ప్రయత్నిస్తూ ప్రజల ప్రాణాలతో టీడీపీ నేతలు చెలగాటం ఆడుతున్నారని సుంకర ధ్వజమెత్తారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

కటకం నాగకుమారి ప్రసాద్

పెడన అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) ; పెడన పట్టణంలోని స్థానిక గుడివాడ మెయిన్ రోడ్డు నందుగల శ్రీ గంగా పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామి వారి ఆలయం వద్ద మరికొద్ది రోజుల్లో రాబోయే కార్తీక మాసం దృష్టిలో పెట్టుకుని భక్తులకు శివాలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండుటకు ముందుగా శానిటేషన్, మరియు ఎలక్ట్రిషన్ పనులను దగ్గరుండి పరిశీలించిన పెడనపట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు మరియు ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ హరి కిషోర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కాగిత

కృత్తివెన్ను అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) : కృత్తివెన్ను మండలం శీతనపల్లి పంచాయ తీ సంగమూడి శివారు కాలనీ మరియు చెరుకుమిల్లి సిమెంట్ రోడ్లు శంఖుస్థాపన చేసిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, ఈ కార్యక్రమంలో ఒడుగు తులసిరావు, పిన్నింటి రత్తయ్య, పాశం నాగమల్లేశ్వరరావు, కూనసాని చిన్న,కూనసాని శ్రీనివాసరావు, కూనసాని సునీత, మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు వివికె నరసింహారావు కుమార్తె ఆకస్మిక మృతి

విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 28, (ఆంధ్రపత్రిక) : తెలుగుదేశం నాయకులు వి వి కె నరసింహారావు కుమార్తె వైష్ణవి ఆకస్మికంగా మృతి చెందారు. రెండు నెలల క్రితమే వైష్ణవి వివాహాన్ని అత్యంత ఘనంగా చేశారు. అయితే ఆమె అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందడంతో నరసింహారావు ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. మరణ వార్త తెలియగానే పలువురు ప్రముఖులు నరసింహారావును పరామర్శించారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ళ విద్యాధరరావు, తెలుగుదేశం నాయకులు దూండీ రాకేష్, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, ఎంపీ పీఏ జగన్, టిడిపి నాయకులు కొణిజేటి రమేష్, విజయవాడ ఛాంబర్ అధ్యక్షులు గడ్డం రవి, ఆర్యవైశ్య సంఘ నాయకులు గడ్డం సత్యనారాయణ, కుసుమంచి గణేష్, ప్రవీణ్, ప్రదీప్, గోపి , సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా వైష్ణవి అంత్యక్రియలు సోమవారం జరిగాయి.

టపాసుల షాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అధికారులు

పెడన అక్టోబర్28 (ఆంధ్రపత్రిక) ; దీపావళి టపాసుల షాపులను ఏర్పా టు చేయడానికి గుడివాడ బైపాస్ రోడ్ లో గత ఏడాది ఏర్పాటుచేసిన స్థలాన్ని అధికారులు సోమవారం పరిశీలించారు. ఇంచార్జ్ తాసిల్దార్ అనిల్ కుమార్ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు ఎస్ఐ సత్యనారాయణ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కటికరెడ్డి పి.ఎం.పి. సభ్యత్వం రద్దు: ప్రతినిధి ప్రసాద్ వెల్లడి

మొగల్తూరు అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక) ; మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామంలో పీఎంపిగా పని చేస్తున్న కటికరెడ్డి జగన్నాథరావు సభ్యత్వాన్ని పీఎంపి అసోసియేషన్ నుండి తొలగిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధి సిహెచ్ వి.పి. శ్రీనివాస్ ప్రసాద్ సోమవారం మొగల్తూరు విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జగన్నాథరావు వైద్యాన్ని చేస్తున్నారని సభ్యత్వాన్ని పిఎంపి అసియేషన్కు ఫిర్యాదు అందినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదు పై విచారణ నిర్వహించి ఆయనను అసోసియేషన్ నుండి తప్పించి సభ్యత్వాన్ని రద్దు పరిచినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత
శ్రద్ధ వహించాలి

కేసులు రీ-ఓపెన్ అయితే ఫిర్యాదుదారులతో మాట్లాడతా అని హెచ్చరిక
కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖపట్టణం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని, సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఒకసారి నమోదైన ఫిర్యాదు మళ్లీ ఓపెన్ కావడానికి వీలు లేదని, అలా జరిగితే ఫిర్యాదుదారులతో నేనే స్వయంగా ఫోన్లో మాట్లాడతానని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అవసరమైతే జిల్లా అధికారులు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం వచ్చిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకే అంశంపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు రావడానికి వీలు లేదని సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ రోజు వచ్చిన వినతుల్లో 26 ఫిర్యాదులు అత్యవసరంగా పరిష్కరించాల్సినవి ఉన్నాయని ఆయా శాఖల అధికారులు 29వ తేదీ సాయంత్రం లోగా వాటిని పరిష్కరించి నివేదించాలని సూచించారు. గత వారం వచ్చిన వాటిలో 27 ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆయా శాఖల పరిధిలో వచ్చిన వినతులపై ఆడిట్ నిర్వహించుకోవాలని చెప్పారు. అంతర్ విభాగాల పరిధిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని, కోర్టు కేసులు ఏమైనా ఉంటే త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ-ఆఫీస్ విధానానికి ప్రాధాన్యత ఇచ్చి ఫైళ్లను సర్క్యులేట్ చేయాలని చెప్పారు.

వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్‌కు 237 వినతులు:

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 237 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 54, జీవీఎంసీకి చెందినవి 61, పోలీసు శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 103 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు హాజరయ్యారు.

చెకుముకి ప్రతిభా పరీక్ష నందు
జడ్పిటిసి మనవడు ప్రతిభ

జిల్లా స్థాయిలో సాయిప్రణవ్ ద్వితీయ స్థానం

కోరుకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి ప్రతిభా పరీక్షనందు కోరుకొండ జడ్పిటిసి సభ్యులు కర్రి సూర్యనాగేశ్వరరావు మనవడు నాగేశ్వరసాయి ప్రణవ్ ప్రతిభ చూపించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల నందు చదువుతున్న జడ్పిటిసి మనవడు, ఎస్బిఐ ఉద్యోగి అనసూరి శ్రీనివాస్ తనయుడు నాగేశ్వరసాయిప్రణవ్ తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించారు. సోమవారం ఈసందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావువారి చేతులమీదుగా ప్రతిభ చూపిన సాయిప్రణవ్ సిల్వర్ మెడల్ స్వీకరించారు. ప్రతిభ చూపిన విద్యార్థి సాయిప్రణవ్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

న్యాయం.. చేసేది ఎవరు..?

వి.ఆర్.పురం.అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలం వి.ఆర్.పురం గ్రామంలో కొన్ని ఇళ్ల యజమానులు తమ ఇళ్లలో కట్టడాలు కొన్ని నమోదు కాలేదని పిర్యాదు చేసిన నేపథ్యంలో అవి నమోదు చేస్తున్నారు. మంచిదే? ఈ 37 గ్రామాలలో నోటిఫికేషన్ పడిన కానించి వడ్డీ గూడెం పంచాయతీలో వున్నా వి.ఆర్ పురం గ్రామంలోని బి.సి కాలనీ వందల కుటుంబాల పేర్లు నోటిఫికేషన్‌లో రాలేదు. అప్పటినుండి బీసీ కాలనీ ప్రజలు ఎక్కని ప్రభుత్వ గుమ్మం లేదు. అడగని నాయకులు లేరు. ఎందరో అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేసిన ఫలితం లేదు. గత ప్రభుత్వం వున్నా నాయకులు ఎంతో భరోసా ఇచ్చిన అది కార్యరూపం దాల్చలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచింది. వారు ఈ బి.సి కాలనీ బాధితులకు ఎంత న్యాయం చేస్తారో చూడాలి. ఇప్పుడు జరుగుతున్న సర్వేతో పాటు తమ కాలనీ కూడా సర్వే జరుగుతుందని ఆశగా చూస్తున్నారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చటానికి ఎంత కాలం పడుతుందో? ఒకవూరిలో అందరికి ఒకేసారే పరిహారం వస్తే సంతోషం పడతారు. కానీ ఊళ్ళో కొందరికి వచ్చి దాదాపు 2 వందల కుటుంబాలు రాకపోతే వారందరి భాద వర్ణనతీతం అధికారులు వస్తు పోతుంటారు. స్థానిక నాయకులు పార్టీలు ఇక్కడ వారికి ఆధారం. కనుక బి.సి కాలనీ ప్రజలకు ఎవరు అధికారంలో ఉంటే వారే సహాయం చేయగలరు. స్థానిక అధికారపార్టీ నాయకులు పెద్ద మనసు చేసుకొని స్థానిక ఎమ్మెల్యే శిరీష దేవి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి తమ సమస్య పరిష్కారం చేయాలని తమ కష్టం ఆందోళన గుర్తించి గ్రామంలో అందరితో పాటు న్యాయం జరిగేటట్టు చూడాలని స్థానిక నాయకులను కోరుతున్నారు. వడ్డీగూడెం పంచాయతీలో వున్నా అందరికి న్యాయం జరగాలని తమను మినహాయించకుండా అందరితో పాటు మాకు కూడా పోలవరం నష్ట పరిహారం ఇప్పించాలని బి.సి. కాలనీ వాసులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అద్భుతంగా పాలిస్తున్న
కూటమి ప్రభుత్వం

- మేనిఫెస్టోను పవిత్ర గ్రంధాలు అని చెప్పి ప్రజలను మోసం చేసిన జగన్
- ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాను పెంచి పోషించిన వైసిపి ప్రభుత్వం
- పల్లా శ్రీనివాస్, పీలా గోవింద సత్యనారాయణ ఇల్లులు కూలగొట్టడంలో ప్రముఖ పాత్ర పోషించిన వీసీ ప్రసాద్ రెడ్డి
- విద్య వ్యవస్థను నాశనం చేసిన విసి ప్రసాద్ రెడ్డిని వదిలిపెట్టేది లేదు

విశాఖపట్నం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): స్థానిక సీతంపేటలో ఉన్న జనసేన పార్టీ నగర కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఈ మధ్య కాలంలో మీడియాలో ఎక్కువగా కనిపిస్తున్నారు. అధికారంలో ఉన్నపుడు మీడియా ముందుకు రాలేదు అని మండి పడ్డారు. ఐదేళ్లు ఇంట్లో వున్నారు. రెడ్ బుక్ సంప్రదాయం వచ్చింది. విశాఖలో ఇల్లు కూల్చింది మీరే అని దుయ్య బట్టారు. ఇప్పుడు నీతి కబుర్లు చెబుతున్నారు. జగన్ ముందు ముద్దులు పెడతారు, తరువాత రొడ్డుపైకి తీసుకోస్తారు అని గుర్తు చేశారు. మాయ మాటలు ప్రజలు నమ్మరు. గుడ్ బుక్ ఎక్కడ వుంది. దొంగలు దౌర్జన్యాలు ప్రోత్సహి స్తావ్. నమ్ముకున్న వారు పుట్ట గతులు లేకుండా పోయారు. మోస పోయారు. తలుపులు తెరిస్తే పది మంది కూడా బయటకు వెళ్లి పోతారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన. పోల వరం పూర్తి చేయ లేదు. మద్య పానం నిషేధం, రెండు లక్షల ఉద్యోగాలు అన్నావ్. నాలుగు నెలల్లో ప్రజా వ్యతిరేకత వచ్చింది అని జగన్ అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ శాఖలో 20 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుతో ఈ శాఖ ఉనికి కోల్పోయింది. ఇసుక ర్యాంప్‌లు, మెటల్ మీద దోపిడీ చేసి బతికే వారు. వైసిపి హయాంలో ఎక్సైజ్ శాఖ నిర్వీర్యం అయ్యేలా ప్రభుత్వం మద్యం షాపులు ఏర్పాటు చేశారు. కూటమి వచ్చాక ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ చేశారు. మిధున రెడ్డి మూడు కోట్లు వంతున ముడుపులు వసూలు చేశారు. అట్ట పెట్టలు కూడా కుం బకోణం చేశారు. మైన్స్ రెండు కోట్లు వసూలు చేశారు. రాజ్ రెడ్డి ద్వారా మిథున్ రెడ్డి లీలలు బయటకు వస్తాయి. ఈ కుంభకోణాలు మీద విచారణ చేయాలి అని సిఎంను కోరారు. విశాఖ పర్యటనకు వచ్చే ఎక్సైజ్ శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తాను. ప్లాస్టిక్ నవ్వులతో ప్రజలను మోసం చేసిన జగన్‌కు షర్మిల, తల్లి అన్న లెక్క లేదు. విజయ సాయి రెడ్డినీ వాడుకుని వదిలేస్తారు అని తెలుసు. మాజీ ఎం.పీ. ఎంవీవి, కాటరాజు ఇద్దరూ దొందూ దొందే అని విమర్శించారు. జీవీఎంసీ జోన్ 3ని జోన్ 2లోకి మారుస్తామనీ తెలిపారు. వన్ టౌన్ విక్టోరియా ఆస్పత్రినీ కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

టిడిపి సభ్యత్వానికి అపూర్వ స్పందన:పొత్తూరి రామరాజు

మొగల్తూరు, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం నరసాపురం నియోజకవర్గం ఇన్చార్జి పొత్తూరి రామరాజు ముత్యాలపల్లి గ్రామంలో ప్రారంభించారు. ముందుగా ఎన్టీరామారావు విగ్రహానికి రామరాజు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం భవిష్యత్ తరాలకు భరోసా వంటిదని, ఇటువంటి ప్రమాద సంభవించినప్పుడు వారికి ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ కవరేజ్ కలదని, చనిపోయిన రోజునే మట్టి ఖర్చులు నిమిత్తం 10,000 రూపాయలు ఆర్థిక సాయం చేస్తుందని తెలియజేశారు , కార్యకర్తల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ఆలోచించి వారికి మనోధైర్యాన్ని కల్పించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలియజేశారు.ఈ కార్యక్రమం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బందన నర్సింహస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల పార్టీ అధ్యక్షులు గుబ్బల నాగరాజు క్లస్టర్ ఇంచార్జ్ కొల్లాటి బాలకృష్ణ మొగల్తూరు మండల బీసీ సెల్ అధ్యక్షులు కొల్లాటి మూలాస్వామి, పాల రాంబాబు దొంగ శ్రీను తెలుగుదేశం పార్టీ గ్రామ సెక్రెటరీ కొల్లాటి పెంటయ్య పెద్ద సింగి నాగేశ్వరావు, కొల్లాటి బుల్లబ్బాయి కొల్లాటి నాగేశ్వరరావు, దొంగ రాంప్రసాద్ దొంగ శ్రీను, కొల్లాటి కోటేశ్వరరావు, తిరుమణి భాస్కరరావు, నాగిడి రాంబాబు బందన విజయ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నాణ్యతా
పరీక్షలు నిర్వహించండి

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాఖపట్నం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ నగర ప్రజలకు నిత్యం సరఫరా చేస్తున్న తాగునీటిలో కలుషితం లేకుండా నిత్యం నాణ్యతా పరీక్షలు అన్ని నీటి పంప్ హౌస్‌లలో నిర్వహించాలని, శుద్ధిచేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద్ రాజు, నేటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కెవిఎన్ రవితో కలిసి బర్మా కాలనీలో గల బ్లాక్ 18 నీటి సరఫరా పంప్ హౌస్ నుపరిశీలించారు. ఈ పరిశీలనలో బర్మా కాలనీ పంప్ హౌస్ వద్ద సరఫరా జరుగుతున్న నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ పంప్ హౌస్ ద్వారా సరఫరా జరుగుచున్న తాగునీటిలో రోజుకు ఎన్ని శాంపిల్స్ పరీక్షిస్తున్నారని కమిషనర్ ఆరా తీయగా పర్యవేక్షక ఇంజనీర్ స్పందిస్తూ బర్మా కాలనీ బ్లాక్ 18 పంప్ హౌస్ 2270 కిలోలీటర్ల సంపు కలిగి ఉన్నదని, 18,182 నీటి సర్వీస్ కనెక్షన్ల ద్వారా ఈ ప్రాంతంలో ఒక లక్ష మంది ప్రజలకు రోజుకు 10 ఎంఎల్‌డి తాగునీటిని మధ్యాహ్నం రెండు గంటల నుండి ఆరు గంటల వరకు సరఫరా చేయడం జరుగుచున్నదని, రోజుకి 18 నీటి శాంపిల్స్ను పరీక్షించడం జరుగుతుందని కమిషనర్‌కు వివరించారు. అనంతరం సమీపంలోనున్న ఒక ఇంటి వద్ద వ్యక్తిగత నీటి కొళాయిలో వస్తున్న నీటిని కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఆ పరీక్షలో నీటి నాణ్యత 2 పిపిఎం ఈసీ 320గా నమోదయిందని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ సీనియర్ ఎనలిస్ట్ శివరామకృష్ణ కమిషనర్ కు వివరిస్తూ సరఫరా జరుగుతున్న నీరు నాణ్యత కలిగి ఉన్నదని ఎటువంటి కలుషితం లేదని కమిషనర్ కు తెలిపారు. ఈ పరిశీలన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రజలకు అందించవలసిన తాగునీటిలో ఎటువంటి కలుషితం లేకుండా నిత్యం సుమారు 2500 క్లోరిన్ పరీక్షలు వ్యక్తిగత కొళాయిలు, పబ్లిక్ కుళాయిలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌ల వద్ద నీటి సరఫరా విభాగం మరియు ఏజెన్సీల ద్వారా జరుపుతూ రోజుకు 300 ఎఎల్‌డి తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇకపై నగరంలో గల ఏ ప్రాంతంలోనైనా తాగునీటి పరీక్షలను నిర్వహించేందుకు మొబైల్ టెస్ట్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు చేయడమైనదని అన్నారు. తద్వారా నీటి కలుషితలను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. కాలువల వద్ద కలిసే 398 నీటి పైప్ లైన్లను గుర్తించి అందులో 375 పైపులైన్లను వేరే చోటికి మార్పు చేయడం జరిగిందని మిగిలిన 23 మార్పు చేయాల్సి ఉందని అన్నారు. అలాగే పైప్ లైన్ లీకులను సుమారుగా రోజుకు 25 నుండి 30 వరకు గుర్తించగా వాటిని వెంటనే అరికట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. అలాగే భూగర్భ మురుగునీటి కాలువల మాన్ హెూల్ పొంగిపొరలి కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. నగర ప్రజలు డయేరియా వ్యాధి బారిన పడకుండా నీటి కలుషితాలను అరికడుతూ జీవీఎంసీ నిత్యం శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించడం జరుగుచున్నదని, ఒక నిరంతర ప్రక్రియగా జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ప్రజలకు అందించవలసిన నీటి సరఫరాలో ప్రత్యేక జాగ్రత్తలు చేపడుతుందని,అలాగే వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు కలిగిన నివాసితులు ఇంటిలో అంతర్గత పైప్ లైన్ కనెక్షన్లలో గల నీటిని కలుషితం కాకుండా, అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యపరమైన రక్షణ చర్యలు, జాగ్రత్తలు చేపడుతూ జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్యని ర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ, బిఎస్ కెమికల్స్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.18వేల విలువైన బాణసంచా సామగ్రి పట్టివేత

వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి

వేపాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): జిల్లా ఎస్పీకి వచ్చిన సమాచారంపై మండలంలోని సోంపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో రూ.18వేల 380ల విలువైన బాణసంచా సామగ్రినీ సోమవారం స్వాదీనం చేసుకున్నామని వల్లం పూడి ఎస్సై బొడ్డు దేవి తెలిపారు. గ్రామానికి చెందిన గొర్లి వెంకన్న అనే వ్యక్తి గేదెల సత్యవతి ఇంటి పక్కన బాణసంచా సామగ్రిని తయారు చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. సుమారు 1100 తారాజువ్వలు, 176 వంకాయ బాంబులు ఈ దాడిలో దొరికాయని వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై దేవి తెలిపారు.

134 పరుగుల అధిక్యంలో హిమాచల్ ప్రదేశ్

డబుల్ సెంచరీకి చేరువలో హిమాచల్ ప్రదేశ్ కెప్టెన్ ఆర్.ఆర్. దావన్

హిమాచల్ ప్రదేశ్ పరుగులకు బ్రేకులు వేసిన ఆంధ్ర బౌలర్లు

మధురవాడ,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ రంజీ ట్రోఫీ మ్యాచ్ విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మూడో రోజు హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ సోమవారం ప్రారంభమైంది. తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ మూడో రోజు మ్యాచ్ సమయం ముగిసేసరికి 150 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 478 పరుగులు చేసి 134 పరుగులు అధిక్యంలో ఉంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ క్రీడాకారులు ఆకాష్ పి వశిష్ట్ 85 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. జట్టు కెప్టెన్ రిషి ఆర్ ధావన్ గ్రౌండ్లో బ్యాట్‌తో చెలరేగిపోయాడు. 318 బంతుల్లో 19 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 195 పరుగులు చేసి డబల్ సెంచరీకి చేరువలో నిలిచారు. ముకుల్ నేగి 42 పరుగులు చేసి అర్ధ సెంచరీకి చేరువలో అవుట్ అయ్యాడు.

బౌలింగ్‌లో సత్తా చాటినా ఆంధ్ర: బౌలింగ్ బరిలో దిగిన ఆంధ్ర జట్టు బౌలర్ కె.వి. శశికాంత్ తన అద్భుతమైన బౌలింగ్ తో హిమాచల్ ప్రదేశ్ పరుగులకు బ్రేకులు వేసి నాలుగు వికెట్లను కైవసం చేసుకున్నాడు. పి.సత్యనారాయణరాజు కూడా అద్భుతంగా రానించి మూడు వికెట్లను కైవసం చేసుకున్నాడు. టి. విజయ్, జి.మనీష్‌లు తలొక వికెట్ ను సొంతం చేసుకున్నారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 89 వినతులు

- నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాఖపట్నం, అక్టోబరు-28 (ఆంధ్రపత్రిక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కు 89 వినతులు వచ్చాయని, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ఆమె జివిఎంసి కమీషనరు డా.పి.సంపంత్ కుమార్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 89 అర్జీలు/ ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 02, 2వ జోన్‌కు 17, 3వ జోన్‌కు 12, 4వ జోన్‌కు 05, 5వ జోన్‌కు 22, 6వ జోనుకు 10, 8వ జోన్‌కు



11, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్, అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 09, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 45, ఇంజినీరింగు విభాగమునకు 12, యు.సి.డి విభాగానికి 11 కలిపి మొత్తంగా 89 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి:
జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

అనంతరం జీవీఎంసీ కమిషనరు మాట్లాడుతూ, ప్రతి సోమవారం ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులు మరలా తరచుగా వస్తున్నాయనిలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై సంబంధిత సీనియర్ అధికారులు వారితో చర్చించి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టాలని జివిఎంసి అధికారులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద రాజు, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, సిసిపి ఎ.ప్రభాకర రావు, సిపి మీనాకుమారి, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఎ, ఎ.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, శాంసన్ రాజు, సంపత్ కుమార్, డిపిఓలు చంద్రిక, ఎం.వి.డి ఫణిరామ్, డిసిపి రామలింగే శ్వర రెడ్డి, ఎసిపి హరిదాసు, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంకు అనూహ్య స్పందన

స్వయంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచిన జిల్లా ఎస్పీ.

రాజమహేంద్రవరం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): తూర్పు గోదావరి జిల్లా పోలీస్ శాఖ వారు కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ మరియు రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ స్మారకోత్సవాలలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రాజమహేంద్ర వరం, జాంపేటలో గల పోలీస్ కన్వెన్షన్ హాల్ నందు కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పోలీస్ వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించడం జరిగింది. వైద్య శిబిరంలో 22 రకాల స్పెషలిస్ట్ డాక్టర్లతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపును జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో పలువురు పోలీసులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది రక్తదానం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ... పోలీసు సిబ్బంది అంతా తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే ఉద్యోగం పోలీసు ఉద్యోగం అని, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సమర్థవంతంగా నిర్వహించగలమని, అటువంటి ఉద్యోగం చేస్తున్న జిల్లా పోలీస్ సిబ్బంది యొక్క ఆరోగ్యం కోసం ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించామని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్యాంపు మొత్తాన్ని నిర్వహించినటువంటి డాక్టర్ దీపక్ డి.ఎం.ఆర్ కు జిల్లా ఎస్పీ గారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా యొక్క శాంతి భద్రతలు మరియు జిల్లా సిబ్బంది యొక్క సంక్షేమమే ముఖ్య ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేస్తూ, ఈ మెగా మెడికల్ క్యాంపును దగ్గరుండి ఆర్గనైజ్ చేసిన అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజుని, డి.ఎస్.పి(ఏ ఆర్) రవి కుమార్‌ని, ఇన్స్పెక్టర్ (ఎస్‌బి) అనసూరి శ్రీనివాసరావుని, ఇతర అధికారులను మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉచిత పోలీస్ మెడికల్ క్యాంపుకు సుమారు 400 మంది పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సిబ్బందికి ఉపయోగపడే ఇటువంటి మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి, జిల్లా సిబ్బంది యొక్క సంక్షేమం దిశగా నిరంతరం శ్రమించే ఎస్పీ తూర్పుగోదావరి జిల్లాకు రావడం, సిబ్బంది మరియు జిల్లా ప్రజల అదృష్టంగా వారు భావం వ్యక్తం చేశారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ సీఈవో మరియు చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్.ఎస్ రామరాజు, కిమ్స్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్, జాయింట్స్ ఆర్థోపెడిక్స్ సర్జన్ డాక్టర్ ఆనంద చౌదరి,క్యాన్సర్, యూరాలజీ, న్యూరాలజీ,న్యూరో సర్జరీ,ప్లాస్టిక్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనిక్, కార్డియాలజీ,జనరల్ సర్జరీ,జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు ఆంకాలజీ విభాగములకు సంబంధించిన అత్యంత అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించి, అవసరమగు వారికి ఉచితంగా పలు రకాల మందులను పంపిణీ చేసినారు.

జాగ్రత్తగా వుండండి.. భయాందోళన చెందవద్దు

-సీఐ. యం.కె .రాజు..

ఎటపాక,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): సర్కిల్ ఇన్స్పెక్టర్, యం.కె .రాజు కూనవరం పరిసర ప్రాంత ప్రజలకు పత్రికల ద్వారా ఒక సమాచారం అందజేశారు. కూనవరం మండలంలో నిన్న సుమారు రాత్రి 8:30 గంటల సమయంలో వి.ఆర్.పురం గ్రామస్తులు కొంతమంది చింతూరు నుండి కూనవరం మీదగా కారులో వస్తుండగా కూనవరం మండలంలోని లింగాపురం గ్రామ సమీపంలో పులి రోడ్డు పక్కన అరుస్తూ కనిపించినది కానీ అది వారిపై ఎటువంటి దాడి చేయడం జరగలేదు. దానికి సంబంధించిన వార్తలు అవాస్తవమని తరు వాత వారు దారిలో కనిపించిన వారికి తెలుపుతూ వచ్చినారు. అంతట సమాచారం తెలుసుకొన్న అటవీ శాఖ అధికారులు మరియు పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా కూనవరం టు చింతూరు వెళ్ళు మరియు చింతూరు టు కూనవరం వెళ్ళు వాహనాలను మళ్ళించడం అయినది. కావున కూనవరం మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా రాత్రిపూట ఆరు దాటిన తరువాత బయటకు రావొద్దని మరియు పశువులను మెపుటకు లేదా వేటాడుటకు వేటగాళ్ళు అడవిలోకి వెళ్ళరాదని హెచ్చరిస్తున్నాము. అటవీ శాఖ వారు పులి జాడ గురించి దర్యాప్తు చేస్తున్నారు. కావున ప్రజలందరూభయభ్రాంతులకు గురికావొద్దని జాగ్రత్తగా వుండవలెనని తెలియజేసారు.

నిరంతరం ఉచితంగా శిక్షణ ఇస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాద రావు

మునగపాక, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):మా ఊళ్ళో గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు మాతృ భాష మీద పట్టు సాధించడం కోసం పిల్లలకు లయబద్ధంగా, రాగయుక్తంగా పద్యాలు, దేశ భక్తి గేయాలు పిల్లలకు నేర్పించడంతో పాటు వాళ్లకు తరుచుగా పోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తున్నారు. నిరంతరం ఉచితంగా శిక్షణ ఇస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాద రావు మాట్లాడుతూ మాతృ భాషలో పట్టు సాధించినట్లు అయితే ఆంగ్ల భాషలో కూడా మంచి పట్టు సాధించవచ్చు అని తద్వారా అన్ని సబ్జక్ట్స్ లోను ప్రతిభ పిల్లలు చూపిస్తారు అని తెలిపిరి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షులు భీశెట్టి ధన శ్రీను, కార్యదర్శి యల్లపు సంజీవరావు, డైరెక్టర్స్ తులసి, సునీత, గ్రంథాలయం సహాయకులు ఆడారి జగ్గాప్పారావు పాల్గొనిరి.

నేడే అచ్యుతాపురం రానున్న కార్మిక శాఖ మంత్రి

అచ్యుతాపురం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం అచ్యుతాపురం వస్తున్నట్లు ఎలమంచిలి నియోజ కవర్గం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రి ఈఎస్ఐ ఆసుపత్రికి ఉద యం 11.30 గంటలకి శంకుస్థాపన చేయనునట్లు తెలిపారు. ఈ కార్యక్ర మానికి అధికారులు, కూటమి శ్రేణులు హాజరు కావాలని విజ్ఞప్తి చేసింది.

జోనల్ స్థాయి సైన్స్ ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్

ఫ్యూచర్ ఆన్ అనే అంశాలపై పలు ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు..

మధురవాడ,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): జీవీఎంసీ 6వార్డు పరిధిలో కొమ్మాది సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల వేదికగా ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి సైన్స్ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఈ సందర్భంగా తిలకించి అభినందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు రూపొందించారు. జల వనరుల నిర్వహణ, పార్కింగ్ సమస్య లకు పరిష్కారం, సోలార్ విద్యుత్ వినియోగం, గృహ నిర్మాణాలు, వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రదర్శలు ఇచ్చారు. వాటి గురించి క్షుణ్ణంగా వివరించారు. భవిష్యత్తులో వాటి ఉపయోగాలను తెలుపుతూ రూపొందించిన ప్రాజెక్టుల రూపకల్పనపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఇలాంటి వేదికలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్, కొమ్మాది, ఇతర గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

- సర్పంచుల మూకుమ్మడి హెచ్చరిక. - ఎంపిడిఓకి తీర్మాన పత్రం అందజేత

వేపాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):రాజ్యాంగ బద్ధంగా సర్పంచులకు సంక్రమించిన హక్కులను కాలరాస్తే సహించేది లేదని మండలంలోని సర్పంచులు హెచ్చరించారు.ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన, ఎంపిడిఓ సారథ్యంలోసోమవారం ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరాయి, ముకుందపురం, పీ.కే ఆర్ పురం సర్పంచులు మాట్లడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులకు చెల్లించాల్సిన బిల్లులు పంచాయతీ ఉపాధి హామీ బ్యాంకు అకౌంట్ ద్వారా మాత్రమే చెల్లించాలని డిమాండ్ చేశారు.అలా కాకుండా రాజ్యాంగ విరుద్దమైన విధానాలతో బిల్లులు చెల్లించి సర్పంచులను అవమానించడం తగదన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్పంచుల నోటీసులో పెట్టకుండా పనులు చేపడితే మంచిపోయి చెడు రావడం తప్పదన్నారు.ఎంపీడీవో సూర్యనారాయణ,పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఆలీలు పంచాయతీ కార్యదర్శులకు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తగు సూచనలు సలహాలు ఇచ్చి సర్పంచులను గౌరవించేల చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్బంగా ఎంపీడీవో సూర్యనారాయణ ,పీ.ఆర్ ఏఈ ఆలీ మాట్లాడుతూ అందరం మండల అభివృద్ధి కోసం కలసికట్టుగా పనిచేద్దామని,సొంత నిర్ణయాలు తీసుకుంటూ సర్పంచులను అవమాన పరిచేది లేదని భరోసా ఇచ్చారు.అనంతరం సర్పంచులు ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు.ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఎస్. అప్పారావు, వేచలపు వెంకట చిన రాము నాయుడు, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):నూకాంబిక అమ్మవారికి భక్తులు హుండి ద్వారా తే 27-06-2024 ది నుండి నుండి 28-10-2024 ది వరకు మొత్తం 123రోజులలో సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను సోమవారం నాడు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానము ఉత్సవ మండపములో హుండీ లెక్కింపు జరిగినది. సదరు లెక్కింపులో నగదుగా రూ? 52,88,674/-లు, బంగారం 57.400 మిల్లి గ్రాములు వెండి 2 కేజి 200 గ్రాములు వచ్చినది. సదరు హుండీ లెక్కింపులో ఆలయ డిప్యూటీ కమీషనరు, కార్యనిర్వహణాధికారి ఎం.సుజాత, జిల్లా ఏసి సుధారాణి, మరియు అనకాపల్లి, పర్యవేక్షణలో లెక్కింపు జరిగినది. సదరు హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు వారు మరియు భక్తులు పాల్గొన్నారు.

వాష్ సంస్థకు అడపా శ్రీనివాస్ రూ. 7 వేల చెక్కు విరాళం

కోరుకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్య అనుచరుడు ఏడు వేల రూపాయలు చెక్ సోమవారం విరా ళంగా అందజేశారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఎస్సీపేటలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేయడం కోసం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ ఏడు వేల రూపాయలు చెక్కును ప్రజల తరపున విరాళంగా వాష్ సంస్థకు అందచేయమని స్కూల్ ప్రధానోపాధ్యాయులు పిబి సుచరితకు అందజేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ మాట్లాడుతూ, పాఠశాల యందు విద్యార్థులకు మంచినీటి వాటర్ ట్యాప్, వాష్ బేసిన్ ఏర్పాటు, వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు వాష్ సంస్థ ముందుకు వచ్చిందని, ఇందుకోసం 70 వేల రూపాయల వ్యయం అవుతుందని, ఆ మొత్తం వ్యయంలో జనసేన నాయకులు శ్రీనివాస్ అందించిన విరాళం సొమ్ము స్కూల్ హెచ్ ఎం సుచరిత వాష్ సంస్థ వారికి 10 శాతం భాగస్వామ్యం వాటాగా 7 వేల రూపాయలు చెల్లించవలసి ఉంది. ఈకార్యక్రమంలో భాగంగా, తక్షణమే అడపా శ్రీనివాస్ 7 వేల రూపాయలు చెక్కు సుచరిత ద్వారా వాష్ సంస్థకు వారికి అందజేయమని తెలియపరిచారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షులు కంటే కేశవరావు, మాజీ సర్పంచ్ పోలేపల్లి రామారావు, మండల టిడిపి అధ్యక్షులు గండి విజయ్ కుమార్, కన్నాబత్తుల యేసు, చిన్న బుజ్జి, యేసురత్నం, స్కూల్ టీచర్ వై కృష్ణప్రభ, ఆర్ రాజేశ్వరి ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిట్రగండ బీటీ రోడ్డు తక్షణమే నిర్మాణం చేపట్టాలి

- డిఈకి వినతి పత్రం అందించిన సర్పంచ్ పి.రామ్మూర్తి

దుంబ్రిగుడ,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):కొల్లాపూటు పంచాయితీ పరిధి గల నందివలస,బిట్రగుండ, గ్రామాలకు కలుపుతూ బూసిపుట్టు కూడలి నుంచి బలియాగుడ గ్రామం వరకు 2 కిలోమీటర్ల వరకు రూ.1.50 లక్షల గత వైసిపి ప్రభుత్వం హయంలో మంజూరు అయినది. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారుడు కొంతమేర నిర్మాణ పనులు చేసి మధ్యంతరంలో నిరుపయోగంగా వదిలేయడంతో ఆయా గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురి అవుతుండడంతో స్థానిక వార్డు సభ్యుడు బి.సుందర్ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకుని సోమవారం మండల కేంద్రంలో డిఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యపై డిఈ స్పందిస్తూ తక్షణమే గ్రామలకు సందర్శించి ఈ యొక్క సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని సర్పంచ్ స్థానిక విలేకరులకు తెలిపారు.

నక్కవారిపాలెంలో స్త్రీల ర్యాలీ

మొగల్తూరు, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధిలో మొగల్తూరు ఫారిష్ 2 నక్క వారిపాలెం క్రీస్తు లూథరన్ చర్చి స్త్రీల ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో వ్యాఖ్య సందేశం డి.మణికుమారి లాజరస్, ఫెరిష్ పాస్టర్ తలారి కొండయ్య మోజేష్ మార్టిన్స్, తలారి వాణీ. మోజేష్ మర్టిన్స్, సి.ఆర్. విల్లూరి లాజర్, డెలిగేట్ బొడ్డుపల్లి సుబ్బారావు, ఆల్టర్నేట్ డెలిగేట్ కోణాల ప్రసాదరావు,పీసీసీ దీపాటి వెంకటేష్, సంఘ పెద్దలుతో పాటు. కొండావారి పాలెం, గోదవారి పేట,రాజుగారి తోట,పాలకమ్మ చెరువు సంఘాల స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాటకు విలువేది?

మునగపాక, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, ఒకే రోజు ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించి రికార్డులు సృష్టించారని, ఆ గ్రామ సభలకు విలువ లేకుండా ఇప్పుడు వేరే వ్యక్తులకు ఉపాధి హామీ పథకం ఇవ్వడం ఏంటని వాడ్రాపల్లి సర్పంచ్ కాంగ్రేగు నూకరాజు ప్రశ్నించారు. మండలంలోని సర్పంచ్లు అంతా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం అయ్యారు. పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే ఉపాధి హామీ పథకం పనులు జరగాలని మునగపాక ఎంపీడీవోకు మండల సర్పంచులు అంతా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సర్పంచులను అవమానపరిచే విధంగా సంబంధం లేని వ్యక్తులకు కాంట్రాక్టులు ఇవ్వటం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఆయ పంచాయితీల నుండి చెల్లించాల్సి ఉంటుందని కాంట్రాక్టులు వేరే వ్యక్తులు చేస్తే పేమెంట్ విషయంలో అల్లర్లు జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టు పథకానికి మార్చడం సరికాదని సర్పంచులు ఆరోపించారు. మండల సర్పంచులు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పల నాయుడు, కే.దేవుళ్ళు, కే.ముసలి నాయుడు, కే.సత్యనారాయణ తదితర మండల సర్పంచులు పాల్గొన్నారు.

మద్యం షాప్ పాడుకున్నవాడు కొంప కొల్లేరేనా?

షాప్ ఎక్కడ పెట్టుకోవడానికి నానా ఇబ్బందులు

షాప్ మనవాడిదయితే ఎక్కడైన ఉండవచ్చా?

గుడి పక్కన మాంసం దుకాణలు చేపల కోట్లు ఉండవచ్చా?

విఆర్.పురం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):గత కొన్ని రోజులుగా మండల కేంద్రాల్లో మద్యం దుకాణలు గురించి వివా దం నెలకొన్నాయి. ఊరు పరిధి చిన్నది? ఎక్కడ షాప్ పెట్టాలన్న గ్రామ పరిధి తక్కువగా ఉండటంతో ఈ మద్యం దుకాణలు ఇళ్ల పరిసరాల పెట్టవలసి వస్తున్నది. ఊరు చివర గుళ్ళు ఉన్నాయి ఊళ్ళో బడులు వున్నాయి. పోనీ తాగేవాళ్ళు తక్కువ అంటే డివిజన్‌లో మండలం మందు పాట దరిదాపు కోటి రూపాయలకు వెళ్ళింది.. పొద్దుక్రుంగిన తర్వాత మందు కొట్టనివాడు అరుదుగా వున్నారు. మన మండలంలో బెల్ట్ షాప్‌లు నడిపెంచే వాళ్ళు కోట్లు సంపాదించారని ఊళ్ళో ప్రచారాలు.. మరి కోటి పాడుకున్నావాడు కొట్టు పెట్టుకోవడానికి నానా ఇబ్బందులు ఇళ్ల మధ్య ఎక్కడ మందు అమ్మడం లేదా? అది ఎవరికీ కనబడదా. మొన్న ఒక బెల్ట్ షాప్ నడిపించే వ్యక్తిని పట్టుకుంటే లక్ష ల్లో తెలంగాణ మందు దొరికింది. దొరికిన వ్యక్తి దుకాణం చుట్టూ నాలుగు ఐదు బెల్ట్ షాప్‌లు వున్నాయని సారా కూడా అక్కడ దొరుకుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవి ఇక్కడ ఆందోళన చేసే వారు వీటిని కూడా కట్టడిచేయడానికి కృషి చేయాలి. ఇవి అన్ని ఇక్కడ ఎవరి కీ తెలియకుండా జరుగుతున్నాయా? వి.ఆర్ పురంలో ఫుడ్ సప్లై చేసే స్విగ్గి.. జూమోటో రాలేదుగాని మందు సప్లై చేసే స్కూటీ వ్యాపారం వుంది. ఇది ఎవరికీ తెలియదా..? ఇళ్ల మధ్య మందు అమ్ముతున్నారని ఎవరు పోలీస్‌కి ఎందుకు పిర్యాదు చేయడం లేదు. మండలంలో ప్రతి గ్రామంలో బెల్ట్ షాప్‌లు ఉపాది కేంద్రాలుగా మారలేదా? సందుకో బెల్ట్ షాప్ వున్నాప్పుడు ఎవరు ఎందుకు అడ్డుచెప్పడం లేదు.. అసలు పోలీసుల దృష్టికి ఒక్కరైనా తెచ్చారా? లక్షల్లో ప్రభుత్వని సొమ్మును కట్టి వ్యాపారం చేయడానికి అనుమతి ఉంది. ఇన్ని అడ్డంకులు ఏ రాజకీయ పార్టీ ప్రేరేపణ తో జరుగుతుంది. ప్రజల గురించి పోరాడే వారికి గ్రామాల్లో సారా తయారీ గురించి తెలియదా? బెల్ట్ షాప్‌ల గురించి ఎవరు ఎప్పుడు ఆందోళనలు ఎందుకు చేయలేదు? యువత నాశనం అవుతుంది.. ఈ మద్యం గంజాయి వల్ల కాదా? ఈ డివిజన్ పరిధిలో గంజాయి ఎన్నోసార్లు దొరికింది. ఆ విష సంస్కృ తి మన గ్రామల్లో కూడా విస్తరించిందని ప్రజలు చర్చించు కుంటున్నారు. మండల కేంద్రనికి పది పదిహేను కిలోమీటర్ల పరిధిలో చింతూరు వెళ్లే రహదారి మార్గంలో ఇది కూడా దొరుకుతుందని ప్రచారం వుంది. ఎంతో మంది యువకులు ఈ మద్యం విపరీతంగా త్రాగి లివర్ కిడ్నీ రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరిగి లక్షలు ఖర్చు పెడుతున్నారు. రాత్రి పది గంటలలోపు అనుమతి వున్నా మద్యం షాప్‌లు మూసేస్తే మందు కుర్రోళ్లకు ఎలా దొరుకుతుంది. ఈ బెల్ట్ షాప్‌ల్లో కాదా? మరి ఈ దుకాణాలు కట్టడి చేసే వారు ఎవరు లేరా? పది రూపాయలు ఎక్కువ అమ్మితే గొడవ చేసే మందు బాబులు బెల్ట్ షాప్‌లో యాభై రూపాయలు ఎక్కువ పెట్టి కొంటారు. ఇది ఇక్కడ విచిత్రం? వి.ఆర్ పురం మొదలు కొని రేఖపల్లి వరకు రోడ్డు పక్కన.. ప్రజలు పోలీసులు ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారు సోదాలు చేస్తే సారా అమ్మేవాళ్ళు తెలంగాణ మందు అమ్మే వాళ్ళు దొరుకుతారు. మరి వీరి గురించి ఆందోళన ఎందుకు చేయడం లేదు. గుడి పక్కన మాంసం దుకాణలు చేపల కోట్లు ఉండవచ్చా? అందరు ఆధ్యాత్మిక వేత్తలే మద్యం మాత్రం ప్రతి సందులో దొరుకుతుంది...మొన్న వి.ఆర్ పురం మద్యం దుకాణాలు పెట్టమని ఒకరు ఆందోళన చేస్తుంటే. ఇంకొకరు ఇక్కడ వద్దని ఆందోళన చేస్తున్నారు.. మరి ఇన్ని ఏళ్ల నుండి ఇక్కడ మద్యం షాప్‌లు వున్నాప్పుడు ఒక్కసారి కూడా ఆందోళన చేసిన దాఖలాలు లేవు నిజంగా మనకి ఇబ్బందిగా వున్నాప్పుడు మొదట్లోనే వీటిని అపవలసింది? అదే మన వాళ్ళు అనుకునే రాజకీయ నాయకులకు ఈ మద్యం షాప్‌లు వస్తే ఇంతటి ఆందోళనలు జరుగుతాయా? అని మందుప్రియులు ప్రశ్నిస్తున్నారు..ఇక్కడ మద్యం దుకాణలు వద్దు. మంచిదే! బెల్ట్ షాప్‌లు ఇళ్లల్లో ఉండవచ్చా? మద్యం షాప్ నడిపించే వారు కూడా షాప్ వద్ద ఒక మనిషిని నియమించుకొని షాప్ చుట్టూ పక్కల ఎవరు మందు త్రాగకుండ కట్టడిచేయాలి. అప్పుడు అక్కడ వుండే గ్రామస్తులకు ఇబ్బందిగా ఉండదు. మద్యం దుకాణం వారు జనాలు ఆలోచించండి.

- సీతానగరం ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీలు స్వీకరణ
- త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం
- ఉచిత ఇసుకను అందరికీ అందజేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం
- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ / సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక):సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఉదయం 11. 00 గంటల నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన జనసైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే బలరామకృష్ణ దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామాల్లోని పరిస్థితులను ఎమ్మెల్యే దృష్టిలో పెట్టడంతో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అలాగే కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక విధానంలో ఎటువంటి జాప్యాలు, అవకతవకలు జరగకుండా చూడాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకు వెళ్ళేవారు అతి వేగంతో ట్రాక్టర్లను నడపవద్దని, ఇసుక లోడ్ చేసిన తర్వాత పైన టార్పాలిన్ కవర్ తో కప్పివేయడం ద్వారా మీ వెనుక వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఉంటుందని సూచిం చారు. ఎవరైనా ప్రభుత్వ విధానాలను అతిక్రమించినట్టు నాదృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరికొన్ని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే బత్తుల సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈనేపథ్యంలో కార్యాలయం కోలాహలంగా మారింది. ఈకార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జడ్పిటిసి చల్లమల్ల వెంకటలక్ష్మి, ఎంపీడీవో మద్దిపట్ల భారతి, తహసిల్దార్ ఏ శ్రీనివాసరావు, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ దాడి రామ్ కుమార్, మాజీ జెడ్పిటిసి వలవల రాజా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, జనసేన, తెలుగుదేశం, బిజెపి కూటమి నాయకులు, పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రని కలిసిన

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

అచ్యుతాపురం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): ఎక్సేంజ్ గనుల శాఖ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విశాఖ ఎయిర్పోర్టుకు చేరుకున్నారు. అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి విశాఖ వచ్చిన కొల్లు రవీంద్రకు ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఘన స్వాగతం పలికి, మర్యాద పూర్వకంగా కలిసారు.

అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ అక్రమ లే ఆఫ్ ఎత్తివేసి

పరిశ్రమ తెరవాలని గేట్ వద్ద సీఐటీయూ నిరసన

అచ్యుతాపురం, అక్టోబర్ 28, (ఆంధ్రపత్రిక):అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ అక్రమ లే ఆఫ్ ఎత్తివేసి పరిశ్రమ తెరవాలని గేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరావు మాట్లాడుతూ 14 రోజులుగా అచ్యుతాపురం ఎస్ ఈ జెడ్‌లో గల అభిజిత్ ఫెర్రో టెక్ మూసివేసిన పరిశ్రమను తెరిచి వెయ్యి మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆందోళన చేస్తున్నా, యాజమాన్యం కార్మికుల గోడు పట్టించుకోవడంలేదని యాజమాన్యం అక్రమంగా లే ఆఫ్ ప్రకటించిందని, లే ఆఫ్ ప్రకటించే ముందు చట్టపరంగా తీసుకోవాల్సిన అనుమతులు కూడా తీసుకోలేదని, దీనివల్ల 1000 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, నిబంధనలు పాటించని కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, కంపెనీ ఉత్పత్తి ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని కార్మికులని రోడ్డును పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు, బోనస్ వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం నుండి కోట్లాది రూపాయలు రాయితీలు పొందుతున్న కంపెనీ యజమానులు కంపెనీలు మూసివేసి కార్మికులను రోడ్డున పడేస్తున్నారని, కార్మిక శాఖ అధికారులు కంపెనీ మూతపడినా స్పందనలేదని, అతి తక్కువ ధరలకు భూములు ఇచ్చిన రైతులు ఈరోజు ఉపాధి లేకుండా రోడ్డును పడ్డారని, కావున తక్షణమే డెవలప్మెంట్ కమిషనర్ ప్రభుత్వం చొరవ తీసుకొని కంపెనీ తెరిచేలా చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా వ్యాప్త ఉద్యమంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కే.సోమనాయుడు, అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌తో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

గర్నికం కస్తూరిబా బాలికా విద్యాలయంలో ప్రశస్త్ యాప్‌పై అవగాహన కార్యక్రమం

రావికమతం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):మండలంలో గర్నికం కేజీబీవీలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం. రమ్య శ్రావణి అధ్యక్షతన అక్కడ ఉన్న ఉపాధ్యాయులుకు ప్రశస్త్ యాప్‌పై అవగాహన సోమవారం కల్పించారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయునీలు అందరూ చేత ప్రశస్త్ యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్ చేయించి కస్తూరిబా బాలిక విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న బాలికల వివరాలను నమోదు చేయించారు.ఈ సందర్బంగా ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు 21రకాల వైకల్యాలను ప్రస్తావిస్తూ 'ప్రశస్త్' యాప్ రూపొందించారని ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు తెలిపారు.అలాగే ప్రసస్త్ యాప్‌లో రెండు పార్ట్‌లు ఉంటాయని 'పార్ట్-ఎ'లో తరగతి సాధారణ ఉపాధ్యాయులు 63 ప్రశ్నల ద్వారా విద్యార్థుల ప్రవర్తన ఆధారంగా గుర్తించడం జరుగుతుందని, 'పార్ట్-బి'లో మరిన్ని భిన్న ప్రవర్తనలు గల విద్యార్థులను స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఐ.ఈ.ఆర్.పి ప్రత్యేక ఉపాధ్యా యులు గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ యాప్‌లో సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు అందరూ ఈ ప్రశస్త్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, సరోజనీ, గర్నికం కస్తూరిబా బాలిక విద్యాలయం ప్రిన్సి పాల్ మేడం ఎం రమ్య శ్రావణి, కేజీబీవీ టీచర్‌లు, విద్యార్థునీలు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో రక్తదానమే ప్రాణదానం

రక్తదానం చేసిన యువతకు ఎస్పీ అభినందనలు

అనకాపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):"ోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు-2024 కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కశింకోట గ్రామంలో గల కళ్యాణ మండపం వద్ద గాజువాక, ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి కశింకోట పోలీసులు మరియు గ్రామ యువత స్వచ్ఛందంగా వచ్చి 97 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేసిన కశింకోట గ్రామ యువతను, ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసిన అనకాపల్లి ఇంచార్జీ డీఎస్పీ బి.అప్పారావును, స్వయంగా రక్తదానం చేసిన ఇన్స్పెక్టర్ అల్లు స్వామి నాయుడు ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. గ్రామ యువత ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేయడం ఇతరులకు ప్రాణం దానం చేసినట్లేనన్నారు. రోడ్డు ప్రమాదాలు ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను మరియు రక్తహీనత కారణంగా ఇబ్బందులకు గురవుతున్న వారికి ఈ రక్తాన్ని అందించాలని లక్ష్యంతో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదానం చేసిన యువతకు బ్లడ్ డోనార్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జీ డీఎస్పీ బి.అప్పారావు, కశింకోట ఇనస్పెక్టర్ అల్లు స్వామి నాయుడు, ఎస్సై లక్ష్మణరావు, స్టేషన్ సిబ్బంది మరియు కశింకోట గ్రామ యువత ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ చేయడం

అమ్మకంపై కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ

అనకాపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):బాణసంచాను అనుమతి లేకుండా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు నిర్దేశించిందని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పలు సూచనలు చేశారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే అమ్మాలి. మిగిలిన ఎవరు విక్రయించినా చట్ట ప్రకారం శిక్షారం. బాణసంచా విక్రయ/తయారీ లైసెన్స్ కల్గిన దుకాణదారులు ప్రమాదాలు నివారణ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలి. జిల్లాలో శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ లేదా విక్రయాల లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలి. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. అగ్నిపమాదాలను నిలువరించేందుకు వీలుగా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలి. మైనర్లను బాణసంచా తయారీ మరియు విక్రయ పనుల్లో ఉంచుకోరాదు. లైసెన్స్ కలిగి ఉన్న విక్రయిదారులు లైసెన్స్ లేని వారికి విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్ దారులదే పూర్తి బాధ్యత. జనావాసాలకు, విద్యాసం స్థలకు, హాస్పటల్స్ కు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలి. దీపావళిని పురస్కరించుకొని బాణసంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా, తయారుచేసినా, వాటిని వినియోగించినా, అటువంటి వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడమే కాక ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గతంలో ఇతర ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. అంతేకాకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ, పోలీసు వారి నియమ నిబంధనలను పాటించాలి. ఏమాత్రం నిబంధనలు అతిక్రమించినా, అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్యరహిత టపాసులనే కాల్చాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112 లకు లేదా స్థానిక పోలీసుల కు గాని తెలియ చెయ్యాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీసులకు తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్., తెలిపారు.

డ్వాక్రా సంఘాలు వడ్డీ లేని రుణాలతో ఆర్థిక అభివృద్ధి చెందాలి

అనకాపల్లి. అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):పట్టణం 81 వ డివిజన్ గవరపాలెం పార్కు సెంటర్ నందు జీవీఎంసీ యుసిడి, మరియు మెప్మా స్వయం సహాయక సంఘ సభ్యులతో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ ఇంచార్జ్, తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర గారు రిబ్బన్ కటింగ్ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్టాల్స్ అన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలు, ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలు, తీసుకొని సొంతంగా చిరు వ్యాపారాలు, చేసుకుంటూ, జీవించడం శుభపరిణామమని, ఇంకా కొత్త సభ్యులను డ్వాక్రా సంఘాల్లో చేర్చుకొని వారికి ఆర్థికంగా లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ డివై సంతోష్ కుమార్, సిహెచ్ సందీప్, కూటమి పార్టీ నాయకులు బొడ్డేడ జోగి నాయుడు, కొణతాల అప్పలరాజు, విల్లూరి హరి, మారిశెట్టి భాస్కర్, సిఎ కొండమ్మ, రాజేశ్వరి, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు తో పాటు మల్ల రామకృష్ణ, దాడి వెంకట అప్పారావు, పెంటకోట శ్రీనివాస్, మల్ల గణేష్, పొలమరశెట్టి చందు,చదరం శివ అప్పారావు, వేగి కృష్ణ, పీలా శ్రీనివాసరావు, ఎండకుర్తి అప్పలరాజు, వానపల్లి కోటేశ్వరరావు, తిప్పన అప్పారావు, ఎల్లపు జగన్నాథరావు, పెంటకోట శివరాం, రామోజీ శ్యాంసుందర్, జామి రాజు, అనకాపల్లి రాము, ఎండపల్లి శేఖర్, నంద్యాల గణేష్, షేక్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

అచ్యుతాపురం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రకి కూటమి నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్ బాబు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మల్ల సురేంద్ర, బీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగ జగదీశ్వరరావు, ప్రగడ నాగేశ్వరరావు, ఆడారి మంజు, లాలం భవాని భాస్కర్, కొణతాల రత్నకుమారి తదితరులు ఉన్నారు. మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్ కూడా ఘన స్వాగతం పలికారు.

ప్రతి ఒక్కరూ తెలుగుదేశం

సభ్యత్వం తీసుకోవాలి

నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి

కోరుకొండ / రాజానగరం, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): తెలుగు దేశం పార్టీ సభ్యత్వం ప్రతి ఒక్కరు తీసుకోవాలని రాజనగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామంలో సోమవారం తెలుగు దేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమంలో రాజనగరం టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజనగరం నియోజవర్గం, గతంలో బూరుగుపూడి నియోజకవర్గంగా వున్న ఈప్రాంతంలో ప్రజలు తెలుగుదేశం పార్టీ పట్ల ఎంతో మక్కువ చూపారని, చూపిస్తున్నారని అన్నారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో బొడ్డు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చిట్టిప్రోలు పద్దరాజు, కందుల బాబు రాయుడు, నక్కిన శ్రీను, సుంకర అరుణ్ కుమార్, సాగర్, వనుం శ్రీను,పాపారావు,స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారి జనార్ధనపై

చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): వైసీపీ అధికారంలో ఉండగా కోడి గుడ్డు మంత్రి గుడివాడ అమర్నాథ్ అండదండలతో చిన్న నాలుగు రోడ్డు జంక్షన్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణలో అనేక అవకతవకలు అక్రమాలు జరిగాయని దీనికి మూల కారణం టౌన్ ప్లానింగ్ అధికారి జనార్ధన్ రోడ్డు డిజైన్ భవన యజమాను నుండి డబ్బులు వసూలు చేసుకుని రోడ్డును అష్ట వంకర్లు చేయడానికి కారణమైన జనార్ధన పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు పి నారాయణ కు లేఖ రాశామని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్టీ పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చింత వారి వీధి నుండి గుడ్ షెడ్ల వరకు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టి చింతావారు వీధి నుండి చిన్న నాలుగు రోజులు జంక్షన్ వరకు కోర్టు వివాదాలు మినహాయించి తక్కిన పనులను పూర్తిచేసి ప్రజలు వినియోగానికి అవకాశాలు కల్పించామని, నాడు ఎంతో రద్దీగా ఉండి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయదని, నేడు ఆ పరిస్థితి ఇక్కడ లేదని, జీవీఎంసీ ఎన్నికల నాడు 22 ఏ లో చిన్న రోడ్లు జంక్షన్ నుండి గాంధీ బొమ్మ వరకు కొన్ని భవనాలు ఉన్నాయని వాటిని 22 ఏ నుంచి జిల్లా కలెక్టర్ మినహాయింపు ఇచ్చినట్లుగా ప్రకటించారని, ఆనాడు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గా ఉన్న సత్యనారాయణ విస్తరణ పనులు చేపట్టారని రోడ్డు డిజైన్ నేరుగా వంకర్లు లేకుండా చేశారని, టౌన్ ప్లానింగ్ అధికారిగా జనార్ధన్ వచ్చిన తర్వాత అమర్నాథ్ ఆదేశాలతో రోడ్డు డిజైన్ మార్చి భవన యజమానులతో కుమ్మక్కై రోడ్డును అష్ట వంకర్లుగా మార్చారని, అలాగే ఇతను పనిచేసిన కాలంలో ఇచ్చిన ప్లాన్లలో అక్రమాలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిని పక్కన పెట్టి భవన యజమానులకు ప్లాన్లు అనుమతులు మంజూరు చేశారని,ఇతను మంజూరు చేసిన ప్లాన్లు అన్నీ కూడా పరిశీలన చేసి ఇతను పదవి విరమణ చేసినప్పటికీ శాఖా పరంగా కేసులు నమోద చేసి జీవీఎంసీ కి నష్టం కలిగించిన దానిని ఇతను నుండి రికవరీ చేయాలని మున్సిపల్ శాఖ మంత్రికి రాసిన లెటర్ లో వెంకటరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యదర్శి ఈ రోడ్డు డిజైన్ పరిశీలన చేసి వంకర్లు లేకుండా నేరుగా రోడ్డును త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని వ్యాపారస్తులు ప్రజలు వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని, కోర్టు వివాదాల్ని పరిష్కరించి టీడీఆర్లు ఇవ్వవలసిన వారికి వెంటనే క్లియర్ చేయవలసిందిగా వెంకటరావు కమిషనర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నోబెల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ 84వ నాయకులు పిళ్ళా తారకేస్ పాల్గొన్నారు.

కేబికే కలుషిత వ్యర్థాలతో ప్రజలకు అనారోగ్యం

దత్తత తీసుకొని గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలి

కాకినాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): పెద్దాపురం మండలంలోని చిన్న బ్రహ్మదేవంలో ఉన్న కేబికే బయోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న కాలుష్య వ్యర్థ జలాల వల్ల నీరు కలుషితమై మనుషులు అనారోగ్యాలకు, పశువులకు వ్యాధులు సోకుతున్నాయని దానిపై చర్యలు కోరుతూ సోమవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతి పత్రం అందింది. చిన బ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఆచంట రాజన్న జిల్లా బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావుతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. కేబికే బయోటిక్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్య వ్యర్థాల వల్ల పొలాలు బీడు వారుతున్నాయని ఆ నీరు భూముల్లో ఇంకుపోవడం వల్ల ప్రజలు, పశువులు రోగాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఆ ఫ్యాక్టరీ ఉన్న చిన బ్రహ్మదేవంతో పాటు వేట్లపాలెం, మేడపాడు గ్రామాలను దత్తత తీసుకొని తగు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ విషయంపై గత వారం గ్రీవెన్స్లో ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఈ కాలుష్య ఫ్యాక్టరీపై సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేస్తామని రాజన్న, రాజేశ్వరరావు తెలిపారు.

గతంలో అనేక తప్పులు..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత మీకు ఉందా?అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది మీరు కాదా అని ధ్వజమెత్తారు. వైకాపా అసమర్థ పాలన, అస్మదీయులకు దోచి పెట్టింది వాస్తవం కాదా అని నిలదీశారు. పీపీఏలను రద్దు చేయడం, ఉత్పత్తిదారులను భయపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం, విదేశీ బ్యాంకుల వద్ద రాష్ట్రం పరువు పోవడానికి మీరు కారణం కాదా జగన్.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు."2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతి ఇచ్చింది మీరే కదా. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగారు. అలాంటి మీరు చంద్రబాబు పాలనను విమర్శించ డమేంటి? మీరు చేసిన తప్పిదాలతోనే కదా అనవసరంగా హిందూజా పవర్‌కు రూ.1200 కోట్లు కట్టాల్సి వచ్చింది. వైకాపా హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. పోలవరం పూర్తి చేస్తానన్నారు.. చేయలేదు. మూడు రాజధానులు నిర్మి స్తానని చెప్పి రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించారు. తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటి?" అని ప్రశ్నించారు.

నటి జెత్వానీ కేసు..

(మొదటిపేజీ తరువాయి)

వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. గతంలో విజయవాడ కోర్టు తనకు విధించిన రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ.. హైకోర్టును ఆశ్రయించారు.కానీ ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. మరోవైపు ఇటీవలే పిటిషన్ తేలేవరకు బెయిల్ పిటిషన్ విచా రణకు ట్రయల్ కోర్టును ఒత్తిడి చేయబోమని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కింది కోర్టులో జర గనున్న విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై విచారణకు ఒత్తిడి చేయబోమని పోలీసులు హైకోర్టుకి హామీ ఇచ్చారు. ఈ నెల 29 వరకు రిమాండ్ విధించారు. సినీ నటిపై అక్రమంగా కేసు నమోదు చేసిన వ్యవహారంలో ఇబ్రహీంపట్నం పోలీసులు ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

పెట్టుబడులే లక్ష్యంగా లోకేశ్ అడుగులు..

(మొదటిపేజీ తరువాయి)

వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలతో నిమగ్నమయ్యారు లోకేష్. రాష్ట్రానికి వీలైనన్ని పరిశ్రమలు తీసుకురావాలన్న లక్ష్యంతో లోకేష్ టూర్ కొనసా గుతోంది. టెస్లా కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన లోకేష్.. టెస్లా సీఎఫ్ఓ వైభవ్ తనేజాతో సమావేశమయ్యారు. ఈవీ రంగానికి అనంత పురం అనుకూలమైన ప్రదేశం పెట్టుబడులు పెట్టండి అంటూ టెస్లా కంపెనీని కోరారు. స్మార్ట్ సిటీలు, గ్రామీణ విద్యుదీకరణ ప్రాజె క్టుల్లో భాగస్వామ్యం వహించాలని కోరారు. అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు ఏపీ తీరప్రాంతం అనుకూలమని చెప్పారు. దీనిపై టెస్లా సీఎఫ్ఓ వైభవ్ తనేజా సానుకూలంగా స్పందించారు. అలాగే రాస్ పెరోట్ జూనియర్‌తో ఏపీ మంత్రి భేటీ అయ్యారు. ఆపై డల్లాస్‌లో పెరోట్ గ్రూప్ ఛైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తోనూ మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. కాగా.. టెస్లా కేంద్ర కార్యాలయ సందర్శన కోసం లోకేష్ ఆస్టిన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మంత్రికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేషల్ మీడియాతో మాట్లాడిన ఆయన.. టెస్లా కంపెనీని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చే కృషి కొనసా గుతుందని,ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానం వల్ల ఏపీకి రావడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): రాజకీ యాల్లో హత్యలు ఉండవని.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ జీవితమే తాజా ఉదాహరణ అని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామ కృష్ణుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడు తూ.. ఎన్‌సీఎల్‌టీలో తల్లిపై, చెల్లిపై కేసులే యడం ద్వారా జగన్ పూర్తిగా పాతాళానికి కూరుకుపోయారన్నారు. అందులో నుంచి అతన్ని బయటకు తీయడం దేవుడెరుగు, జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇది ఆస్తుల వివాదం కాదని.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని.. చివరికి జగన్ తన సొంత తల్లిని, చెల్లిని కూడా మోసం చేశారంటూ మండిపడ్డారు. వాళ్ల కుటుంబ తగా దాలు వాళ్లే రోడ్డుకీడ్చుకుని ఆ బురద మీడియాపైకి నెట్టడం హాస్యాస్పదమన్నారు. షర్మిలకిచ్చిన రూ.200 కోట్లు జగన్‌కు ఎక్కడివని ప్రశ్నిం చారు. 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చానని జగన్ పేర్కొన్నా ఇప్పటికీ ఐటీ, ఈడీ ఎందుకు స్పందిం చడంలేదని అడిగారు. గత నాలుగైదు రోజులుగా పుంఖానుపుంఖాలుగా జగన్ అక్రమాస్తుల రగడ మీడియాలోనే కాదు, పబ్లిక్‌గా జరుగుతుంటే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థల్లో కదలి కలేవి అని నిలదీశారు. క్విడ్ ప్రో కో 1.0, క్విడ్ ప్రో కో 2.0 ప్రో కో కేసులన్నీ ఇప్పటికైనా ఒక కొలిక్కి తేవాలని.. ఒక ఆర్థిక నేరస్తుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేమిటని అన్నారు.

ఎపి సర్కార్ కీలక నిర్ణయం..

(మొదటిపేజీ తరువాయి)

చేయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకూ గోప్యంగా ఉంచిన జీవోలన్నింటినీ ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్త ర్వులు జారీ చేశారు. రహస్యంగా ఉంచిన అన్ని జీవోలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి పాత జీవోలన్నింటినీ అందులో అప్‌లోడ్ చేయాలని ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ అధికారులకు సూచించారు. వెబ్‌సైట్ ప్రారంభమైన 2008 నుంచి ఇప్పటి వరకూ అన్ని ప్రభుత్వ ఉత్తర్వులూ జీవోఐఆర్ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని సాధారణ పరిపాలన శాఖ పేర్కొంది. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకు ఉన్న జీవోలు మాత్రం అందుబాటులో లేకుండా పోయాయని తెలిపింది. పారదర్శకత, సమాచారం నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసే అధికారిక ఉత్తర్వులు పౌరులకు అందుబాటులో ఉండాల్సిందేనని సాధారణ పరిపాలశాఖ పేర్కొంది. వాటన్నింటిని అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు సురేష్ కుమార్ వెల్లడించారు. మూడేళ్ల కాలానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో లేకపోతే సమాచార లోపం ఏర్పడుతుందని, అధికారిక నిర్ణయాలు జీవోల రూపంలో ప్రజలకు స్పష్టత ఇస్తాయన్నారు.

ఉచిత సిలిండర్ల పథకం..

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఒక సిలిండర్ రాయితీ మొత్తం రూ.895 కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నెల 31న ఉచిత సిలిండర్లను ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేయనుంది. మొత్తం మూడు ఉచిత సిలిండర్లకు గానూ రూ.2,684 కోట్ల వ్యయమవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఉచిత సిలిండర్ నిధులను డీబీటీ ద్వారా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేడు ఇడుపులపాయకు జగన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతంలో ఇడుపులపాయ చేరుకుంటారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి పులివెందులకు వెళ్తారు. మూడు రోజుల పాటు పులివెందులలో ప్రజలకు వైఎస్ జగన్ అందుబాటులో ఉంటారు.

తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపు

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. తాజాగా లక్నోలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌కు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. హజ్రత్‌గంజ్ ప్రాంతంలో ఉన్న తాజ్ హెటల్‌కు సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ ఆవ రణలో బాంబు పెట్టినట్లు అందులో పేర్కొన్నారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువూ, పేలుడు పదార్థాలూ లభించలేదని తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కోల్‌కతాలోని 10 ప్రముఖ హోటళ్లకు, రాజ్‌కోట్‌లో 10 హోటళ్లకు, లక్నోలో 10 ప్రధాన హోటళ్లకు ఆదివారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న మూడు హోటళ్లకు శుక్ర, శనివారాల్లో నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. హోటళ్లకే కాదు దాదాపు 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గడచిన 14 రోజుల్లో 350కిపైగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

సచివాలయం వద్ద 144 సెక్షన్ అమలు

హైదరాబాద్,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): తెలంగాణ సచివాలయపరిధిలో ఆంక్షలు విధించారు. ముట్టడి చర్యలతో అప్రమత్తమైన ప్రభుత్వం ఆంక్షలు విధించింది. సచివాలయ భద్రతా సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం చుట్టూ 2 కి.మీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సిబ్బంది కదలికలు, సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. పోలీసు అధికారులపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ కావాలని సిబ్బందిని ఆదేశించారు.

జనాభా లెక్కలు షురూ..!

న్యూఢిల్లీ, అక్టోబరు 28 : దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇది 2026 వరకూ కొనసాగనున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026లో ప్రభుత్వం గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-82, ఆర్టికల్-170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. కానీ గడచిన 50 ఏండ్లుగా నియోజకవర్గాల విభజన జరగలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.ఇక చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్

మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించడం జరిగింది. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేయడం జరిగింది. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణానికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకోవడం జరిగింది. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు.

'భారత్' మరింత ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైన

మిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

'గగన్‌యాన్' మిషన్‌పై ఇస్రో కీలక అప్‌డేట్

న్యూఢిల్లీ,అక్టోబర్ 28 : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక ప్రకటన చేశారు. అంతరిక్షానికి మనిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025లో కాకుండా.. ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ లెక్చర్ సందర్భంగా సోమనాథ్ ఈ కొత్త షెడ్యూల్‌ను వెల్లడించారు. చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో.. తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గనన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యం. ఆగస్టులో చంద్రయాన్-3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చీఫ్ ఇటీవలే వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది. మరోవైపు రానున్న సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను

కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది అంటే 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

400కు పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 : దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే ఏకంగా 400 కుపైగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ అప్రమత్తమైంది. దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఇలాంటి ఘటనలను పరిష్కరించడానికి ఎన్ఐఏ సైబర్ విభాగం బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విశ్లేషణ ప్రారంభించింది. బెదిరింపు కాల్స్‌కు వెనుక ఉన్న ఉద్దేశాలను తెలుసుకునే పనిలో పడింది. ఇతర భద్రతా సంస్థలతో కలిసి బెదిరింపు కాల్స్‌పై విచారణ చేపడుతోంది. ప్రధాన విమానాశ్రయాల్లో బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ బృందాన్ని మోహరించింది. బెదిరింపులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించేలా ఈ బృందం శిక్షణ ఇస్తుంది. అంతేకాదు విమానాశ్రయాల్లో భద్రతా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తుంది. గత కొన్ని రోజులుగా ఇండిగో, ఎయిర్ ఇండియా సహా వందలాది విమానాలకు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. రోజులో కనీసం వంద విమానాలకు ఇలాంటి బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంగా విమానాలు ఆలస్యం కావడానికి తోడు.. ప్రయాణికుల్లో తీవ్ర భయాలు నెలకొంటున్నాయి. అదే సమయంలో విమానయాన సంస్థలు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి. 'విమానంలో బాంబు పెట్టాం' అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ(బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి.

ఎపి హైకోర్టు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో మహేశ్వరరావు కుంచెం (అలియాస్ కుంచం),తూటా చంద్ర ధన శేఖర్ (అలియాస్ టిసిడి శేఖర్),చల్లా గుణరంజన్ లచే అదనపు న్యాయమూర్తులుగా చీఫ్ ధీరజ్ జస్టిస్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.హైకోర్టులో అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈ అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలోని పలువురు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి,హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం,డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డా.వై.లక్ష్మణరావు,పలువులు రిజిస్ట్రార్లు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల దాడి

(మొదటిపేజీ తరువాయి)

సెక్టార్ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆర్మీ వాహనంపై పలు రౌండ్లు కాల్పులు జరిపిన ఉగ్రవాదులు అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ఉగ్రవాదుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాదిని ఆర్మీ మట్టుబెట్టినట్లు తెలిసింది. దీపావళి సందర్భంగా జమ్ము ప్రాంతంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు జరుగుతోన్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగా, జమ్ముకశ్మీర్ అంతటా.. ముఖ్యంగా లోయలో గత వారంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు సహా కనీసం 12 మంది మరణించారు. అక్టోబర్ 24న, బారాముల్లాలోని గుల్‌మార్గ్ సమీపంలో ఉగ్రవాదులు ఆర్మీ వాహనంపై మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఇద్దరు సైనికులు, ఆర్మీలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు మరణించారు. అంతేకాకుండా గాందర్‌బల్ జిల్లాలో సోన్‌మార్గ్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఓ వైద్యుడు, ఐదుగురు వలస కార్మికులు మృతి చెందారు.

దీపావళికి ముందే గాలిలో
తగ్గిన నాణ్యత

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. కాగా, ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే.

వేణుస్వామిపై చర్యలు
తీసుకోండి

- మహిళా కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు

- స్టే ఎత్తివేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): అక్కినేని-నాగచైతన్య శోభిత ధూళిపాళ్ల వైవాహిక జీవితం సక్రమంగా సాగదంటూ జాతకం చెప్పిన వేణుస్వామి చిక్కుల్లో పడ్డారు. నాగచైతన్య-శోభిత నిశ్చితార్థం చేసుకున్న రోజునే రంగంలోకి దిగిన వేణుస్వామి మూడేళ్లలో వీరిద్దరూ విడిపోతారని జోస్యం చెప్పారు. మరో మహిళ ప్రమేయం కారణంగా 2027లో ఈ జంట విడిపోతారని అంచనా వేసి వివాదానికి తెరలేపారు. ఈ మేరకు వీరిద్దరి జాతకాలను వేణుస్వామి విశ్లేషణ చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. దీనిపై తెలుగు ఫిల్మ్ జర్న లిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసి యేషన్ ఆధ్వర్యంలో కొంతమంది జర్నలిస్టులు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది తెలిసిందే. అయితే కమిషన్‌కు ఆ అధికారం లేదంటూ వేణు స్వామి స్టే తెచ్చుకున్నారు. అయితే సోమవారం ఆ స్టే ఎత్తివేస్తూ మహిళా కమిషన్‌కు పూర్తి అధికారాలు ఉన్నాయని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. వారం రోజుల్లో వేణుస్వామిపై తదుపరి చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వేణు స్వామిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. గత ఆగస్టులో తెలుగు ఫిల్మ్ జర్న లిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో.. కొంతమంది జర్నలిస్టులు.. మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. వేణుస్వామిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన తెలంగాణ మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద.. వేణుస్వామిపై, సదరు వీడియోలు ప్రసారం చేసిన యూట్యూబ్ ఛానెళ్లపై విచారణ చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబు ధ్యేయం

- మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):జిల్లా తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంకి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నాద్ హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నాయకులు విచ్చేసి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు. జిల్లా ఇన్చార్జిగా తొలిసారి అనకాపల్లి వస్తున్న సందర్భంగా పెద్ద ఎత్తున నాయకులు పాల్గొని ఘన స్వాగతం పలికారు. పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ పార్లమెంట్ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పిలా గోవింద సత్యనా రాయణ మాజీ శాసన మండలి సభ్యులు పప్పల చలపతిరా వు ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఆఫీసులో పార్టీ నాయకులు అనకాపల్లికి గుర్తుగా బెల్లం దిమ్మ ను మంత్రి కొల్లు రవీంద్ర మాజీ శాసన మండలి సభ్యులు. బుద్ధ నాగ జగదీశ్వరరావు అందించారు. అనంతరం పెంటకోట కన్వెన్షన్ సెంటర్లో జరుగుతున్న నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వంలో రాష్ట్రంలో రాక్షసి పాలన రాజ్యమేలుందన్నారు. ప్రజలు తమపై ఉన్న నమ్మకాన్ని అమ్ము చేయకుండా మంచి పాలనందువలన్నారు ఈ ప్రాంత ఉత్తరాంధ్రజిల్లాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతం సస్య శ్యామల కావాలంటే సుజల స్రవంతి లెఫ్ట్ కెనాల్ రావాలని అన్నారు ఎన్నో పరిశ్రమలు మూతపద్యని నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్నారు అయితే చంద్రబాబు మరల ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నామని పెన్షన్లు భారమైనప్పటికీ ఒకటో తారీఖున ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టమన్నారు అందరం కలిసి సమిష్టింగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్థానిక శాసన సభ్యులు రామకృష్ణ హెూంమంత్రి వంగల పూడి అనిత. మాజీ మంత్రిదాడి వీరభద్రరావు తదితర వక్తలు మాట్లాడుతూ ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర నాథ్ ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రప్రతిక): శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివార్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాల్లో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రా నాయానం నిర్వహించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమం జనం జరిగింది. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం సాయం త్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు యాగశాల వైదిక కార్యక్ర మాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ట నిర్వ హించ నున్నారు. పవిత్రోత్సవాల కారణంగా అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు కల్యాణో త్సవం, అక్టోబరు 29న స్వర్ణపుష్పార్చన, అక్టోబరు 30న అష్టోతర శతకళశాభిషేకం సేవలు ఆర్జితసేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్తులు (ఇద్దరు) రూ.500/- చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొన వచ్చు. గృహస్తులకు ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమా నంగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకట స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడి కేసు

వైసిపి నేత చైతన్యకు 11 రోజుల రిమాండ్

గుంటూరు, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక): టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఏ1గా ఉన్న వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్యను ఏపీ సీఐడీ పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచింది. చైతన్య కస్టడీ ముగియడంతో సీఐడీ అధికారులు కోర్టులో హాజరు పర్చారు. చైతన్యకు కోర్టు మరో 11 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో చైతన్యను వైద్య పరీక్షల అనంతరం జిల్లా జైలుకు పోలీసులు తరలించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయి గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పానుగంటి చైతన్యను విచారణ నిమిత్తం ఏపీ సీఐడీ అధికారులు కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... మూడు రోజుల పాటు చైతన్యను విచారించేందుకు సీఐడీకి కోర్టు అనుమతించింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి (సోమవారం) ఉదయం 11 గంటల వరకు పానుగంట చైతన్యను విచారించేందుకు సీఐడీ పోలీసులకు కోర్టు అనుమతించింది. మూడు రోజుల పాటు సీఐడీ అధికారులు గుంటూరులో వైసీపీ నేతను తమదైన శైలిలో విచారించారు.

కల్ప వృక్ష వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం,అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం స్వామి వారి కల్ప వృక్ష వాహనోత్సవం కన్నులపండువగా జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్ట కళశారాధన, మహాస్నపనం, తోమాల సేవ, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు, దుష్ట గ్రహ దోష నివారణార్థం మహా సుదర్శన హెూమం తదితర హెూమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం శ్రీ వారు ఉభయ దేవేరులతో కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. అలాగే సాయంత్రం స్వస్తి వచనం,ప్రధాన హెూమాలు, విశేషార్చన, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు అనంతరం రాత్రికి కల్కి అవతారంలో అశ్వ వాహనంపై విహరించనున్న శ్రీనివాసుడు అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు,లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం పాల్గొన్నారు.

ఏపీలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

పొడవు పింజ క్వింటా రూ.7521..పొట్టి పింజ క్వింటా రూ.7121

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా రాష్ట్రంలో 2024-25 సీజన్‌కు సంబదించి పత్తి కొనుగోలు కొరకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదును 27 అక్టోబర్ 2024 నుండి ప్రారంభించడం జరిగింది అని ఏపీ మార్కెటింగ్ శాఖ పేర్కొంది. కాబట్టి రైతులు, వారి యొక్క పంట వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోనవలసినదిగా అవగాహన కల్పించారు. అయితే సి.సి.ఐ నాణ్యత ప్రమాణాలు ఉన్నటువంటి పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తుంది కాబట్టి రైతులు నాణ్యమైన విడి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావలసినదిగా ఏపీ మార్కెటింగ్ శాఖ సూచించింది. ఈ విషయమై వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మాత్యులు సమీక్షించి రైతులకు సరైనా అవగాహన కల్పించి మద్దతు ధరకు పత్తిని సి.సి.ఐ.వారికి విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడమైనదని తెలియజేసినారు. ఇక ఖరీఫ్ 2024-25 సీజన్‌కు సంబంధించి భారత ప్రభుత్వం ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధరలు.. పొడవు పింజ క్వింటా రూ.7521..పొట్టి పింజ క్వింటా రూ.7121గా ఉన్నాయి.

బాలినేనికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ

బాలినేని పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రపత్రిక):ఏపీలో జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఇవాళ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఒంగోలులో ఎన్నికల అక్రమాల విషయంలో ఈసీ నిర్ణయాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన బాలినేనిని చుక్కెదురైంది. ఈ మేరకు బాలినేని దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇవాళ తోసిపుచ్చింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలులో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు బాలినేని ఆరోపిస్తున్నారు. దీనిపై ఈసీ విచారణ కొనసాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంగోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి దారుణంగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత తన ఓటమికి ఈవీఎంలలో అక్రమాలే కారణమని ఆరోపిస్తూ ఆయన ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఎన్నికల్లో ఒంగోలులోని 12 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈవీఎంలలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. వీటిలో అక్రమాల నిర్ధారణకు ఈసీ చేసిన పరిశీలనను తప్పుబడుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలోనే విచారణ పూర్తి చేసిన హైకోర్టు తీర్పును మాత్రం రిజర్వు చేసింది. ఇవాళ బాలినేని పిటిషన్ ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఈవీఎంల అక్రమాల విషయంలో ఈసీ వద్దే తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒంగోలులో ఈవీఎం అక్రమాలపై మాక్ పోలింగ్ నిర్వహించిన ఈసీ.. అక్రమాలు గుర్తించలేదు. దీంతో ఈసీ తీసుకునే ఫైనల్ నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారింది. అయితే గతంలో ఈ కేసు వేసినప్పుడు వైసీపీలో ఉన్న బాలినేని.. ఆ తర్వాత జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చర్చలు

రాష్ట్రంలో క్రెడిబిలిటీ ఉన్న పార్టీ కాంగ్రెస్
ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విజయవాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):ఈ రాష్ట్రంలో క్రెడిబులిటి ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే నని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు.. జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. సోమవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... వైసీపీ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేసిందని ఆ పార్టీకు క్రెడిబులిటి లేదని ప్రజలకు అర్థమైందని అన్నారు. వైసీపీపై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రెడిబులిటితో వారి సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేయాలని, వారిలో భరోసా నింపే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. ప్రతి వారం రెండు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపాలని, కార్యవర్గానికి సూచించినట్లు షర్మిల వెల్లడించారు. మరోవైపు.. తన అన్న జగన్మోహన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మళ్లీ విరుచుకుపడ్డారు. స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చిన విషనాగుగా ఆయన్ను అభివర్ణించారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కారణమైన కాంగ్రెస్, చంద్రబాబుతో షర్మిల చేతులు కలిపారని.. జగన్ మళ్లీ సీఎం కాకూడదని ఆమె కంకణం కట్టుకున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలపై ఆమె 'ఎక్స్'లో మండిపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి చంద్రబాబే కారణమైతే.. ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గాడిదలు కాశారా అని ఆయన్ను నిలదీశారు. 'జగన్ ప్రత్యేక విచారణ ఎందుకు జరిపించలేదు? దర్యాప్తు చేసి నిజానిజాలు ఎందుకు బయటపెట్టలేదు? దోషులను ఎందుకు శిక్షించలేదు? అనుమానం ఉండి.. ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఎందుకు ఒక్క ఎంక్వైరీ కూడా వేయలేదు? ఇది మీ చేతకానితనానికి నిదర్శనం కాదా' అని ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ ముమ్మాటికీ కారణం కాదన్నారు. కాంగ్రెస్‌ను ఆయన రెండు సార్లు అధికారంలోకి తీసుకొచ్చారని.. బంగారు బాతును ఎవరూ చంపుకోరని.. సొంత కళ్లను ఎవరూ పొడుచుకోరని స్పష్టం చేశారు.

బిజెపి భిన్నమైన పార్టీ

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

విజయవాడ, అక్టోబర్ 28 (ఆంధ్రపత్రిక):బీజేపీ అన్ని రాజకీయ పార్టీలకంటే భిన్నమైనదని, ప్రతి ఆరు నెలలకొకసారి కొత్త సభ్యులను చేర్చుకోవటంతో పాటు బూత్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులను ప్రజా స్వామ్యం పద్ధతి ద్వారా ఎన్నుకుని ముందుకి వెళ్తున్నామని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం, విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో సహా అందరూ వారి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవటం జరుగుతుందన్నారు. 2014లో ఆరు నెలల పాటు సభ్యత్వాన్ని నమోదు చేసామని, ఆన్‌లైన్ ద్వారా మొదటి సారి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గతంలో 11 కోట్ల సభ్యత్వాన్ని ఆరునెలలో చేసామని, ఇప్పుడు 45 రోజుల్లో 22 లక్షల సభ్యత్వాన్ని నమోదు చేసామని పురందేశ్వరి తెలిపారు. భవిష్యత్‌లో బీజేపీ ఒక బలమైన రాజకీయ పార్టీగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్క కార్యకర్త పని చేస్తున్నందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్థాయిలో పరిపాలనా దక్షత కనభరిచారో దేశాన్ని అగ్ర గామిగా నిలబెట్టిన ఘనత ప్రధాని మోదీదేనని కొనియాడారు. ఏపీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో కేంద్రం సహాయ సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తాజాగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ రాష్ట్ర రాజధాని అమరావతి కనెక్టివిటీ కొరకు రైల్వే నిర్మాణం చేపట్టడం సంతోషకరమని అన్నారు.

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com